
# మిసిమి

మాస పత్రిక


ఆగష్టు - 2006



రూ.8/-



చిత్రకారుడు : మైఖలాంజిలో
(1475-1564)



పవిత్ర కుటుంబం

# మిసిమి

**"All that we are is the product of what we have thought"**
**is "We are what we think." - Dammapada.**

సంపుటి 17 | ఆగస్టు 2006 | సంచిక 8

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

| | |
|---|---|
| సామూహిక భావావేశాలతో రచయిత తలపడాలి | మూలం : బీరేంద్రకుమార్ భట్టాచార్య<br>అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి |
| డివైన్ మైఖలాంజిలో | కాంద్రేగుల నాగేశ్వరరావు |
| సంగీతానికి శాస్త్ర సాంకేతిక విజ్ఞానం తోడ్పాటు? | నాగసూరి వేణుగోపాల్ |
| కథన రీతులలో ఆరితేరిన వృద్ధమూర్తి | 'శ్రీ విరించి' |
| శ్రీశ్రీ, దాశరథి అధికారానికి దాసోహం అన్నారా? | మద్దాలి సత్యనారాయణశర్మ |
| 20వ శతాబ్దంలో తత్వశాస్త్రం - పురోగతి | శివలింగం |
| జాషువా ఆత్మావిష్కారం - నా కథ | డా॥ అద్దంకి శ్రీనివాస్ |
| సాహిత్య విమర్శకుడుగా జి.వి. కృష్ణరావు | డా॥ యు.ఎ. నరసింహమూర్తి |

విడిప్రతి రూ. **8/-** | వార్షిక చందా రూ. **100/-** | విదేశీయులకు **$ 20**

*ముఖచిత్రం :* **కరుణ**

*చిత్రకారుడు :* **మైఖలాంజిలో**

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

*సంపాదకుడు :* **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**




**In Tune (May 20, 1956)**

*(From Shankar's Weekly, Souvenir)*



# సామూహిక భావావేశాలతో రచయిత తలపడాలి

**1979 వ సం॥ జ్ఞానపీఠ్ సాహిత్య పురస్కార స్వీకారోపన్యాసంలోని ముఖ్యాంశాలు**

(అస్సామీ నుండి హిందీలోకి అనువదించబడిన ఉపన్యాసానికి తెలుగు అనువాదం)

అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి



బీరేంద్రకుమార్ భట్టాచార్య
(1924-1997)

పురస్కార ప్రదానోత్సవ సందర్భంలో పురస్కారం పొందిన సాహిత్య కారుడి ఆలోచనలు, భావాలు, విస్తారంగా తెలిసిరావడం సహజం. అవసరం కూడా. నా దృష్టిలో ఈ గొప్ప ఉత్సవానికి రెండు సునిశ్చిత ప్రయోజనాలున్నాయి.

మొదటిది భారతీయ సాహిత్యం ఎన్నో భాషల్లో అభివ్యక్తి పొందినా, ప్రధానంగా అది ఒకటే, అనే సత్యం దీని ద్వారా బుజువవుతుంది. ఏది ఏమైనా ఒక ధ్వని మాత్రం ఖచ్చితంగా భారతీయ భాషల సాహిత్యాల్లో అన్ని చోట్లా వ్యాపించి ఉంది. ఈ ధ్వని మానవీయతకు సంబంధించింది, కరుణాశీలతకు సంబంధించింది, పరస్పర సహనశీలతకు సంబంధించింది, అన్నింటి సమన్వయ భావానికి సంబంధించింది. ఏ అంశాలైతే మన బహు భాషారూపం గల సాహిత్యాలను ఏక సూత్రంలో గుదిగుచ్చుతాయో, ఆ అంశాల నుండి దేశపు ఆంతరంగిక ఐక్యతకు పోషణ లభిస్తుంది. మరో విధంగా చెప్పాలంటే మానవుని విముక్తికి ఇవి సహాయ పడతాయి.

పురస్కార ప్రణాళికకున్న మరో ప్రయోజనం ఏమిటంటే వేర్వేరు భాషలకు చెందిన అనేక సాహిత్య రచనలలో సర్వశ్రేష్ఠమైన రచనను ఎంపిక చేసే విధానం. ఇది సమీక్షా జగత్తు పొందే గొప్ప లబ్ధిగా మనం భావించవచ్చు. సహజంగా వేర్వేరు ప్రాంతీయ భాషలకు తమ తమ ప్రమాణాలున్నాయి. భారతీయ జ్ఞానపీఠ్ వీటన్నింటిని అంతర్లీనం చేసుకుంటూ మూల్య నిర్ధారణ కోసం ఒక సమగ్రమైన పద్ధతిని వికసింప చేసింది. మున్ముందు ఈ పద్ధతి సంపూర్ణ భారతీయ సాహిత్యానికి విలువ కట్టే పద్ధతిగా మారవచ్చు. ఈ పద్ధతి ఆధారంగా చేసిన రచన ఎంపిక మాత్రం చాలా విలువైనదిగా ఉంటుంది.

యథార్థ సంబంధి అయిన సాహిత్యంలో వాస్తవం నుండి పలాయనం చేయడానికి అవకాశం ఉండదు. దాని ధర్మం - నలువైపుల నిరంతరం తరంగాయమానంగా ఉండే సముద్రాన్ని మథించి చేతికి అందిన అమృతాన్ని అందరికీ పంచి పెట్టడం. ఆ సాహిత్య ఉద్దేశ్యం ఎవరినీ కృంగదీయడం కాదు, జీవితంలో వ్యాపించి ఉన్న అశాంతిలో సమన్వయం, సామంజస్యం తీసుకురావడమే దాని ఉద్దేశ్యం. ఈ పని ఎంత పెద్ద రచయితకైనా సులభం కాదు. నా గురించి నేను నివేదించుకో గలగేది ఒకటే. నేను సత్యాన్ని, సౌందర్యాన్ని జీవితంతో మమేకం చేయడానికి నిబద్ధుడనై ఉన్నానని.., ఆలోచనాపరుడైన ఒక రాజకీయవేత్త ఒకసారి ఇలా అన్నాడు — ప్రపంచంలో జరుగుతున్న అన్ని అన్యాయాలకు విరుద్ధంగా సమస్త మానవజాతి తిరుగుబాటు చేయడం 20వ శతాబ్దంలో కనిపించే అన్నిటికంటే పెద్ద విశేషం. స్త్రీలు, బడుగు జీవులు, దళితులు, నల్లవారు, నైపుణ్యం లేని చిన్న చిన్న ఉత్పాదకులు, నియంతృత్వ శక్తుల ద్వారా అణగదొక్కబడిన సాధారణ మానవులు, అందరూ తమ

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ ఆచార్యులుగా పదవీ విరమణ చేశారు. నివాసం న్యూఢిల్లీ.

తమ యాతనల నుండి విముక్తి పొందడానికి తొందర పడుతున్నారు. ఇలాంటి సంపూర్ణమైన, సర్వగ్రాహి అయిన తిరుగుబాటుకు తగిన దిశ, సాహిత్య కారునికి గతిశీలత లేని, చింతనలో, తాత్వికతలో లభించదు. వాటి ఆవలినుండే ఎక్కడి నుండైనా అది లభించాలి. నేటి ప్రశ్నలకు, అవసరాలకు, సమాధానం ఉదారము, అనే కాంతవాది, నిరంతర వికాసశీలి అయిన ఆలోచనా విధానం నుండే లభిస్తుంది.

అలాంటప్పుడు సాహిత్యానికి, సాహిత్యకారునికి ఉండే ప్రప్రథమ కర్తవ్యం స్వయం సంపూర్ణుడు, అక్షతుడు అయిన మానవుడు జీవ జగత్తుకు కేంద్రంగా నిలిచేలా చేయడానికి ప్రయత్నించడం. దిగ్భ్రాంతుడైన మానవుణ్ణి తిరిగి తన లోనికి తాను ప్రవేశించేట్లు చేయడమే సృజన యొక్క లక్ష్యం కావాలి. దురదృష్టవశాత్తూ ఇప్పుడున్న పరిస్థితి అదికాదు. దాన్ని మనం మార్చాలి. గంభీరంగా ఆలోచిస్తే సందేహాలు లేనిదిగా భావించబడే సాహిత్య ప్రక్రియ యొక్క నిర్వచనం ఏదీ ఇప్పుడు ప్రచారంలో లేదు. అంతేకాక సాహిత్య సృజనా విధానానికి సంబంధించిన తృప్తికరమైన స్పష్టీకరణ కూడా లభించడం లేదు. విమర్శకులకు తమ తమ పూర్వాగ్రహాలు (prejudices) ఉంటాయి. ఆధునాతన రచన వారికి అసంగతంగానే తోస్తుంది. అంతేకాక ప్రసిద్ధ సమకాలిక రచయితకు అందులో తారతమ్యం కనిపించదు. సృజన కానీ, విమర్శ కానీ, దాని దృష్టికి పూర్ణ సత్యం యొక్క ఏదో ఒక భాగాన్ని లేక పార్శ్వాన్ని చూడగలగడం మాత్రమే లక్ష్యంగా ఉంటుంది. నేను స్వయంగా సత్యాన్వేషణను ఒక శాశ్వత ప్రక్రియగా భావిస్తూ వచ్చాను. అందుచేతనే నా దృష్టి అనేకాంతవాది, నిశ్చయాత్మకతా వాది కాదు.

నిదానించి చూసి దూరంగా మూలాల్లోకి వెళ్తే రచయిత, తిరుగుబాటు దారుడు, ఇద్దరూ పరస్పరం సజాతీయులు లాగా ఒకరినొకరు గుర్తిస్తారేమో! ఇద్దరూ జీవితము, జగత్తు లోని కురూపత్వం, వైషమ్యం, వీటిని నిరాకరిస్తూ ఒక అందమైన, సామంజస్య పూరితమైన చిన్న ప్రపంచ పరికల్పనలో లీనమై ఉంటారు. తన యుగంలోని సామూహిక భావావేశాలతో విసుగు చెంది నిస్సారమైన ఏదో ఒక కల్పనా లోకంలో నివసించకుండా ఉండడం రచయిత ధర్మం. తన యుగంలోని ఆవేశాల నుండి జన్మించిన క్రూరత్వాన్ని అతడు ఎదుర్కోవాలి కూడా. ఇప్పటి నా మూడు నవలలు - ఇయారుఇంగమ్, ప్రతిపద్, మృత్యుంజయ్ - ఇందుకు సాక్ష్యాలు, ఉదాహరణలు.

నా సమాజం పట్ల, రచయితల సమాజం పట్ల నా మనసులో అచంచల విశ్వాసం ఉంది. ఒక రకంగా నేనిక్కడ వారందరిని సంబోధించే మాట్లాడాను. ఈ సంవాదం ఇక్కడే ముగిసి పోకుండా సార్థకతను సంతరించుకుంటూ ముందుకు సాగిపోతూ ఉంటే నన్ను నేను ధన్యుణ్ణిగా భావించుకుంటాను.

## జీవిత విశేషాలు, సాహిత్య పరిచయం:

వీరేంద్ర కుమార్ భట్టాచార్య 1924, అక్టోబర్ 14వ తేదీన అస్సామ్ రాష్ట్రంలో మారుమూలన ఉన్న ఒక తేయాకు తోట పరిసరాల్లో జన్మించారు. వేర్వేరు జాతులతో కూడిన అక్కడి సామాజిక వాతావరణంలో పెరిగారు. అక్కడే అక్షర జ్ఞానం పొంది, ఢేకియాఖోవా అనే గ్రామంలోని ఇంగ్లీషు మాధ్యమిక పాఠశాలలో చదువు పూర్తి చేశారు. చాలా సార్లు ఏమీ తినకుండానే బడికి వెళ్ళవలసి వచ్చేది. నిలబడాలంటే ఎవరి కాళ్ళ పైన వారే నిలబడవలసి ఉంటుందని ఆ చిన్న వయసులోనే ఆయన తెలుసుకున్నారు.

1937లో 13 ఏళ్ళ వయసులో ఆయన జోర్హాట్ ప్రభుత్వోన్నత పాఠశాలలో చేరారు. తర్వాత 1941లో భాష, సాహిత్యం మొదలైన విషయాల్లో మంచి మార్కులు సంపాదించి మెట్రిక్యులేషన్

పాసయ్యారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ఆయనలోని సాహిత్య ప్రతిభ మొదటిసారిగా వెలుగులోకి వచ్చింది. యువ రచయితలను ప్రోత్సహించేందుకు ఏర్పరచిన స్వర్ణ పథకం వీరికి లభించింది. దానితో పాటు చేతి రాతలో వెలువడే అనేక వార, మాస పత్రికల్లో ఆయన రచనలకు ప్రాధాన్యత లభించడం మొదలైంది. జోర్హాట్ ఆ రోజుల్లో సాహిత్య కార్యకలాపాల కేంద్రంగా ఉండేది. చంద్రకాంత్ బరువా, నీలమణి ఫూకన్, గణేశ్ గోగోయ్ మొదలైన ప్రథమ శ్రేణికి చెందిన అస్సామీ రచయితలు అక్కడే ఉండేవారు. యువకుడైన బీరేన్‌కు వీరందరి సాన్నిధ్యం పూర్తిగా లభించింది.

కొంతకాలం తర్వాత ఈయన గువాహాటీలోని కాటన్ కాలేజీలో సైన్సు విద్యార్థిగా ప్రవేశించారు. అప్పుడే 1942 క్విట్ ఇండియా ఉద్యమం ఆరంభమయింది. యౌవనావస్థలో ప్రవేశించేందుకు మునుపే ఆయన అటువైపు ఆకర్షితులయ్యారు. చదువు ఆగిపోయింది. కాని సాహిత్యం పట్ల క్రియాశీలమైన అనురాగం ప్రగాఢంగా నిలిచింది. రైతుల దయనీయస్థితి, దేశంలోని స్వాతంత్ర్యోద్యమం, డిగ్బోయ్‌లో పెట్రోలియమ్ కూలీల సమ్మె, ఇవన్నీ ఆయన కళ్ళారా చూశారు. ఇవన్నీ ఆ వయసులో కూడా సామాజిక న్యాయం పట్ల నిబద్ధతా భావాన్ని ఆయనలో దృఢంగా నాటాయి. తర్వాతి కాలంలో ఆయనలోని సామాజిక చైతన్య భావన మరింత బలపడింది.

అవకాశం లభించగానే చదువు మళ్ళీ కొనసాగించి 1945లో ఆయన బి.యస్‌సి. పరీక్ష పాసయ్యారు. తర్వాత కొద్ది కాలానికే కలకత్తా వెళ్ళి లక్ష్మీకాంత్ బేజ్‌బరువా నడుపుతున్న అస్సామీ సాహిత్య పత్రిక 'వహ్ని'లో సహ సంపాదకులుగా చేరారు. సంపాదకుడైన మాధవ్ బేజ్‌బరువా అకాల మరణం కారణంగా పత్రిక మూతపడటంతో ఆయన 'ఎడ్వాన్స్'లో చేరి పోయారు. అక్కడ ఉన్న రోజుల్లోనే, 1946లో కలకత్తా సార్వజనిక మారణ కాండ జరిగి అందులో ఆయన మిత్రుడు , కవి, అమూల్య బరువా హత్య చేయబడ్డాడు. ఈ దుస్సంఘటన వల్ల భట్టాచార్యకు దుర్భరమైన మానసిక క్షోభ కలిగింది. కొంత కాలం తర్వాత గువాహాటీ తిరిగి వచ్చి, మనసు కుదట పరచుకుంటూ అక్కడ దేవకాంత్ బరువా సంపాదకత్వంలో వెలువడే 'దైనిక్ అసమియా'లో పనిచేయడం ఆరంభించారు.

సామాజిక న్యాయం, సమానత్వం, సత్యం, మానవ జాతి పట్ల ప్రేమ, ఇలాంటి నైతిక విలువలు భట్టాచార్య మనసులో అభిన్నమైన భాగాలుగా ఏర్పడి పోయాయి. ఆయన హాస్టలులో ఉన్నా, పార్టీ కార్యాలయంలో ఉన్నా, లేక పల్లెటూళ్లో ఏ మిత్రుని గుడిసెలోనో ఉన్నా లేమి, కష్టాలు అన్ని చోట్లా వెన్నాడుతూ వచ్చాయి. ఆయన జీవించిన జీవితపు ఈ స్వరూపమే ఆయన సంపూర్ణ జీవన దృష్టిని రూపొందించింది. తన్ను తాను అతి సామాన్యునిగా భావించుకొని జీవించడం ఎంతో అవసరం-- అనే విషయాన్ని ఆయన చిన్నతనంలోనే గ్రహించారు. అందువల్ల అప్పటి నుండే సుఖం, అధికారం, వీటిని కోరుకోకుండా మానవ జాతి పట్ల మౌన సమర్పణ, సేవా భావంతో కూడిన జీవితం జీవించాలని నిర్ణయించుకున్నారు. ఆయన జీవించిన జీవిత స్వరూపం కూడా ఇదే. ఈ కారణంగానే మానవీయ భావన, సామాజిక న్యాయ భావన, బీదలతో, దళితులతో తాదాత్మ్యం, ఈయన సాహిత్యానికి మూలాధారాలైనాయి. తన నవలలోని పాత్రల వలెనే భట్టాచార్య కూడా మార్పుకు క్రియా శీలమైన సమర్థకులు. వ్యక్తి జీవితంలోనూ, సమాజంలోని పతనోన్ముఖ విలువలలోనూ మార్పు రావాలని ఆయన కోరుకునేవారు. అందువల్ల సామాజిక స్వరూపం ఎలా ఉంది అనే దానికంటే, అది ఎలా ఉండాలి? అనే దాన్ని గురించి ఆయన ఎక్కువగా ఆలోచించేవారు.

పాత్రికేయ జగత్తులో వ్యాపించిన రాజకీయాల ప్రాబల్యంతో విసుగు పుట్టడంతో ఆయన ఒక రోజు హఠాత్తుగా 'దైనిక్ అసమియా'ను వదలి పెట్టి 'జనతా' అనే సమాజవాద పత్రికలో సంపాదకుడుగా

చేరారు. ఇక్కడ ఆయనకు తన స్వంత ఆలోచనలను, భావాలను వెలిబుచ్చే అవకాశం లభించింది. కాని అక్కడ ఇలాంటి పత్రికలు నడపడంలో సాధారణంగా ఉండే ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. ఈ రోజుల్లో 'రంగ్‌ఘర్', 'పచోవా', 'రామ్‌ధేను' మొదలైన పత్రికల్లో కూడా ఆయన కవితలు, కథలు, విమర్శలు, నిరంతరంగా వెలువడుతూ ఉండేవి. ఈ కాలాన్ని ఆయన ప్రయోగాల కాలంగా చెప్పవచ్చు.

1949లో భట్టాచార్య ఉఖరుల్ వెళ్ళిపోయారు. ఉఖరుల్ బర్మా సరిహద్దు సమీపంలో ఉన్న ఒక చిన్న నాగా గ్రామం. కేవలం ఒక మిత్రుని కోరికపైన సైన్సు ఉపాధ్యాయుడుగా అక్కడికి వెళ్ళారు. మరెవరూ అక్కడికి వెళ్ళడానికి సిద్ధంగా లేరు కనుక. అప్పటికి ఆయన దారిద్ర్యాన్ని స్వేచ్ఛగా స్వీకరించి ఉన్నారు. తర్వాతి సంవత్సరాల్లో ఎన్నో మంచి మంచి అవకాశాలు వచ్చినా ఆయన వాటిని ఉపయోగించుకోలేదు. ఉఖరుల్ ఆయన రెండు జతల బట్టలు, 23 రూపాయలకు కొనుక్కున్న సైనికుల పాత గ్రేట్ కోటుతో వెళ్ళారు. ఈ విధంగా ఉఖరుల్ వెళ్ళడం ఆయన జీవితంలో ఒక గొప్ప మలుపు. ఆ రోజుల్లో నాగాల నాయకుడు ఫీజో నాగా యువకులను తన వేర్పాటు ఉద్యమంలో చేర్చుకోవడానికి గొప్ప ప్రయత్నం చేస్తూ ఉన్నాడు. భట్టాచార్య ఆ యువకుల్లో ఎక్కువ మందిని భారత జాతీయ ముఖ్యధారలో నిలిచి పోయేట్లు చేశారు. అంతేకాక ఉఖరుల్‌లో ఉన్న నాలుగు సంవత్సరాల్లో ఆయన దృష్టి విశాలత పెరగడమే కాక, భారతీయ సంస్కృతి విస్తృతిని, దానిలోని జాతిగత వైవిధ్యాన్ని ప్రత్యక్షంగా చూసి అవగాహన చేసుకునే అవకాశం కూడా కలిగింది. ఈ నాలుగు సంవత్సరాల వరమే ఆయన మొదటి ప్రధానమైన నవల 'ఇయారూ ఇంగమ్.'

1953లో భట్టాచార్య 'రామధేను' సంపాదకత్వ బాధ్యతను స్వీకరించారు. అప్పటి నుండి ఈ పత్రిక అస్సామీ సాహిత్యంలో వేర్వేరు ప్రక్రియల్లో కొత్త కొత్త ప్రయోగాలకు వాహికగా నిలిచింది. అక్కడ ఒక కొత్త యుగమే ఆరంభమయిందనిపించింది. దానికి 'రామధేను యుగం' అనే పేరు పెట్టడం కూడా జరిగింది. ఆయన సాహిత్యక, సాంస్కృతిక క్రియాశీలతా కాలాల్లో ఈ కాలం కూడా ఒకటి. 1953లో ఒక ప్రతినిధి మండలి సభ్యుడుగా ఆయన నాగా పర్వత ప్రదేశానికి వెళ్ళారు. దీని ఉద్దేశ్యం నాగాజాతి భారతదేశం నుండి వేరు కాకుండా చూడడం. 1956 ప్రాంతంలో రామమనోహర్ లోహియాతో గాఢమైన మైత్రి ఏర్పడడంతో సమాజవాద ఉద్యమం పట్ల ఆయన ఆకర్షణ మరింత పెరిగింది. ఈ కాలంలో వచ్చిన ఆయన రచనలలో ఇదంతా స్పష్టంగా కనిపిస్తుంది.

పూర్తిగా పది సంవత్సరాలు 'రామధేను'లో పని చేసిన తర్వాత భట్టాచార్య 'నవయుగ'లో చేరి 1967 వరకు సాహిత్యక సాంస్కృతిక వార పత్రిక సంపాదకులుగా ఉన్నారు. తర్వాత ఆ పత్రిక మూత పడింది. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలు స్వతంత్ర పాత్రికేయుడిగా నిలకడ లేని జీవితం గడిపారు. ఈ కాలంలోనే 'అసమియా సాహిత్యంలో పరిహాసం, వ్యంగ్యం' అనే విషయంపై పరిశోధనా గ్రంథంపైన గువాహాటీ విశ్వవిద్యాలయం ఈయనకు డాక్టరేటు బిరుదు నిచ్చింది.

బీరేన్ కుమార్ భట్టాచార్య సృజనాత్మక ప్రతిభ బహుముఖమైంది. ఆయన ఒక మంచి కవి, వ్యాసకర్త, కథాశిల్పి, ప్రభావశాలి అయిన నవలా రచయిత. ఆయన మొదటి ప్రసిద్ధ నవల 'రాజపథే రిండియామ్.' 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం దీనికి ఆధారం. ఇందులో ఆ కాలం నాటి జీవితం చిత్రించబడింది. దాని తర్వాత వెలువడిన నవల 'మృత్యుంజయ' భారతీయ జ్ఞానపీఠ్ పురస్కారం పొందిన విశిష్ట రాజకీయ నవల. ఇందులోని వస్తువు కూడా 1942 ఉద్యమానికి సంబంధించిందే.

నాగా సమస్యను, మానవ ప్రేమ, దేశ ప్రేమల మధ్య జరిగే సంఘర్షణలో జన్మించిన అంతర్ద్వంద్వాన్ని గొప్పగా చిత్రించిన 'ఇయారూ ఇంగమ్' నవలకు సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. 'ప్రతిపద్' వీరి మరో ప్రసిద్ధ నవల. ఇందులోని వస్తువు - సామ్రాజ్య వాద నిరంకుశత్వం ద్వారా పీడనకు గురి అయిన డిగ్బోయ్ రిఫైనరీ కార్మికుల సమ్మె. 1939లో జరిగిన ఈ సమ్మెకు దేశంలోని ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోఒక విశిష్టమైన స్థానం ఉంది. రచయితలో ప్రజాతాంత్రిక సమాజవాదం పట్ల, సామాజిక అసమానతకు విరుద్ధంగా జరిగే తిరుగుబాటు పట్ల ఎంత ఎక్కువ నిబద్ధత ఉంది అనే దానికి ఈ నవల నిదర్శనం.

'ఇయారూ ఇంగమ్' (ప్రజల ప్రభుత్వం) నవలలో రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాగా ప్రదేశం (ఇప్పటి నాగాలాండ్) పైన జపాన్ సైనికుల దురాక్రమణ, తర్వాత అక్కడ తమ ప్రభుత్వం స్థాపించుకునేందుకు వారు చేసిన ప్రయత్నం, కొద్ది కాలం తర్వాత, బ్రిటిష్ సైన్య ప్రత్యాక్రమణలో వారు ఓడిపోయి వెనక్కు పారిపోవలసి రావడం, వగైరా - ఈ కథా క్రమం ఆధారంగా స్థానిక నాగాల జీవితంలోని సామాజిక, సాంస్కృతిక మనోవైజ్ఞానిక పార్శ్వాలను ఎంతో యథార్థ దృష్టితో చిత్రించడం జరిగింది. ఇశాఓర్ అనే జపాన్ సైనికుడు మొదట బలాత్కారం చేసి, తర్వాత ప్రేమ చూపించి సారేంలా అనే యువతిని జీవితాంతం వరకు తోడుగా ఉంటానని మభ్యపెట్టి గర్భవతిని చేస్తాడు. కాని బ్రిటిష్ సైనికుల ఒత్తిడి వల్ల జపాన్ సేనలు పారిపోవలసి వచ్చినప్పుడు అతడు కూడా బర్మా వైపుకు తిరిగి వెళ్ళి పోడానికి సిద్ధ పడుతాడు. సారేంలా తన కడుపులో పెరుగుతున్న అతని సంతానం కోసం అక్కడే ఉండి పొమ్మని అతణ్ణి ప్రార్థిస్తుంది. ఈ క్లిష్ట పరిస్థితిని రచయిత చాలా ప్రతిభావంతంగా చిత్రించాడు. ఇశాఓర్ జపాన్ సైనికులతో పాటు వెళ్ళక పోతే జపాన్ సైనికులే అతణ్ణి చంపేస్తారు. ఒకవేళ ఏదో విధంగా తప్పించుకుంటే బ్రిటిష్ సైనికులైనా చంపేస్తారు. నవలలో యుద్ధ విభీషికలో నలిగిపోయే అసహాయ ప్రేమికుల జీవితాన్ని, దాని నిరాశభరిత పరిణతిని, చిత్రించిన విధానం పాఠకుణ్ణి తీవ్రంగా ప్రభావితుణ్ణి చేస్తుంది. ఇక్కడ కూడా 'మృత్యుంజయ'లో లాగానే రచయిత దృష్టి ప్రధానంగా పాత్రలు, వాటి చిత్రణ కంటే అన్ని వర్గాల వారితో కూడిన సమాజ చిత్రణపైన ఎక్కువగా కేంద్రీకరించి ఉంది.

భట్టాచార్యకు సాహిత్య అకాడెమీ పురస్కారం లభించినప్పుడు ఆయన వయసు 35 సంవత్సరాలు. జ్ఞానపీఠ్ పురస్కారం పొందేనాటికి 56 సంవత్సరాలు. ఈ రెండు పురస్కారాలు ఇంత తక్కువ వయసులో మరే రచయితకు లభించలేదు. వీరు 5 సంవత్సరాలు సాహిత్య అకాడెమీ అధ్యక్షులుగా కూడా ఉన్నారు.

1970లో వెలువడిన వీరి నవల 'మృత్యుంజయ' 1963-72 మధ్య కాలంలో భారతీయ భాషల్లో వచ్చిన సృజనాత్మక రచనలలో సర్వశ్రేష్ఠమైనదిగా ఎంపిక అయింది.

'మృత్యుంజయ' 1942లో చెలరేగిన 'క్విట్ ఇండియా' ఉద్యమ సమయంలో అస్సామ్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా రచించిన నవల. ప్రజలపై ఉద్యమ ప్రభావాన్ని, వారి ఆవేదనలను, ఆకాంక్షలను, నిరాశను వారి అపరాజేయ ఆశాన్విత దృష్టిని, ప్రభావోత్పాదకమైన రీతిలో ఇక్కడ చిత్రించడం జరిగింది. అంతేకాక ఈ నవలలో ఆ రోజుల్లో మొత్తం దేశంలో వ్యాపించి ఉండిన వాతావరణ చిత్రణ కూడా మనకు కనిపిస్తుంది.

భట్టాచార్య 20 నవలలు, 2 కథా సంపుటాలు, 150 కవితలు, 1 యాత్రా వృత్తాంతం, 6 ఇతర గద్య రచనలు, బెంగాలీ నుండి, ఇంగ్లీషు నుండి అనువదించిన 8 పుస్తకాలు, 150 రేడియో నాటకాలు, 50 కి మించి వ్యాసాలు వెలువరించారు.

# డివైన్ మైఖలాంజిలో

- కాండ్రేగుల నాగేశ్వరరావు

క్రీ॥శ॥ 1564 వ సంవత్సరం ఫిబ్రవరి 18వ తేది కళాప్రపంచానికి కాళరాత్రి. "దైవాంశ సంభూతి, మైఖలాంజిలో" అని గౌరవంగా సకల మర్యాదలతో ఇటలీ ప్రజలతో పిలువబడే ఓ కాంతిపుంజం భువి నుండి దివికేగిన దుర్దినమది. పదహారవ శతాబ్ద చరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో సాగిన అతని అంతిమ యాత్రలో వేలాది ప్రజలు పాల్గొని అతనికి నివాళులర్పించారు. ఆనాటి నుండి ఈనాటి వరకు శిల్పి, చిత్రకారుడు, వాస్తు నిర్మాణకారునిగా సృష్టికి ప్రతిసృష్టి చేసిన త్రిముఖ బ్రహ్మ తిరిగి ఈ భూమిపై అవతరించలేదు. ముఖ్యంగా వాస్తవిక కాల్పనిక శైలులను మిళితం చేసి మాటలకే కాదు అనుభూతికికూడా అందనంత దివ్యసౌందర్య ప్రతిమలను మనముందుంచగలిగిన అతనితో సరితూగే శిల్పులెవరూ కళాప్రపంచంలో లేరు. స్తుతి, కుంచె వంటి పనిముట్లు అలవోకగా అతని చేతిలో ఆరవ వేలుగా రూపాంతరం చెందాయి. ఎనభై సంవత్సరాల వయస్సులో కూడ తాను కోరిన కళారీతిని, పాలరాతి గండు శిలలో దృశ్యమానం చేసుకొని తనకు కావలసిన రీతిలో కేవలం ఒక్క వేటుతోనే సరిగ్గా ఛేదించగల నైపుణ్యం అతని జీవన చివరి ఘడియ వరకూ కొనసాగింది. సిస్టయిన్ ఛాపల్‌లో కుడ్యచిత్రాలు వేస్తున్నపుడు నలుగురు సహకళాకారులను పోప్ రెండవ జూలియస్ అందించినా వాళ్ళపనితో రాజీ పడలేక ఇంచుమించు ఏకాకిగా ఆ బృహద్ కార్యాన్ని పూర్తిచేసిన మొండితనమతనిది. అతని శిల్పాలలో, చిత్రాలలో అంతవరకూ కళాప్రపంచం చూడని ఊహించలేని భంగిమలతో బైబిల్ కథలోని సన్నివేశ దృశ్యాన్ని క్షణకాలం ఘనీభూతంచేసి, ముఖంలోను, కళ్ళలోనే కాదు, కాళ్ళలో, చేతులతో, చేతివేళ్ళతో కూడా హావభావాలు పలికించ గలిగాడతను.

మైఖలాంజిలో మార్చి 6వ తేదీ 1475వ సంత్సరంలో ఇటలీలోని, ఫ్లొరెన్స్‌కు నలభై మైళ్ళ దూరంలో వున్న 'కేప్రిస్' (ఇప్పుడా వూరిపేరు 'కేప్రిస్ మైఖలాంజిలో'గా మార్పుచేశారు.) అన్న చిన్న పల్లెటూరిలో సంపన్నకుటుంబంలో జన్మించాడు. తండ్రిపేరు 'లోడోవికో' అతనొక జడ్జి. వారసత్వంగా వచ్చిన ధనస్వామ్య కుటుంబమేకాని, మైఖలాంజిలో పుట్టేనాటికి ఆర్థిక ఇబ్బందులలో చిక్కుకుంది. అతని తండ్రికేనాటికయినా తమ కుటుంబ పూర్వ వైభవాన్ని పునఃప్రతిష్ఠించు కోవాలనే కోరిక వుండేది. అందుకోసం ఆయన మైఖలాంజిలో పై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. మైఖలాంజిలోకు సంవత్సరం వయస్సుండగా ఫ్లొరెన్స్ నగరానికి చేరుకుందా కుటుంబం. ఆరు సంవత్సరాల వయస్సులో తల్లి చనిపోయింది. దానితో సెట్టివాగన్ అనే ఒక వ్యవసాయ క్షేత్రంలోని దాది సంరక్షణలో నాలుగు సంవత్సరాలు గడిపాడు. ఆ క్షేత్రానికి ఆనుకొని వున్న ప్రాంతంలో పాలరాతి గుట్టులు వుండేవి. అక్కడకు వెళ్ళి కూలీలు రాళ్ళను పగులగొట్టే విధానాన్ని దగ్గరుండి గమనించేవాడు. పది సంవత్సరాల వయస్సులో తిరిగి ఫ్లొరెన్స్‌కు తీసుకొని వచ్చాడతని తండ్రి. అక్కడ బడిలోకి ప్రవేశించేసరికి, అతను మిగిలిన విద్యార్థులకంటే నాలుగు సంవత్సరాలు పెద్ద. అది అతనికి చిన్నతనమనిపించింది. చదువుపై శ్రద్ధ పెట్టలేక పోయేవాడు. నెమ్మదిగా చిత్రాలు గీయటంపై ఆశక్తి పెంచుకున్నాడు. బడికి ఎగనామం పెట్టి చిత్రకారుల వద్దకు వెళ్ళి వాళ్ళు చిత్రాలు గీస్తుంటే ఆసక్తితో గమనించేవాడు. ఇది తండ్రికి బాధకలిగించింది.

---

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

ఆయన దృష్టిలో శిల్పులూ, చిత్రకారులు శారీరక శ్రమను ఆశ్రయించుకున్న కూలీలు. ఇది తమ వంటి ఉన్నత కుటింబీకుల ప్రతిష్ఠకు భంగకరంగా భావించాడాయన. కుమారుని తిట్టి, కొట్టి తన దారిలోకి మళ్ళించుకోలేక పోయాడు. చివరకు కుమారుని పట్టుదల ముందు ఆయన కులీనత తలవొగ్గింది. పదమూడు సంవత్సరాల వయస్సుగలిగిన మైఖలాంజిలోను "డొమినికో గిర్లాండియో' అను ఒక కుడ్య చిత్రకారుని వద్ద శిష్యునిగా జేర్పించాడు. ఆతరువాత కొద్దికాలానికే మైఖలాంజిలో ఫ్లొరెన్స్ నగర అధిపతయిన 'లొరెంజోమెడిసీ' చే నడప బడుతున్న శిల్పుల బడిలో జేరి శిల్పకళను అధ్యయనం చేశాడు. ఆ పిన్న వయస్సులోనే శిల్పకళకు సంబంధించిన అన్ని విషయాలలోనూ ముందుండేవాడు. అది సహించలేని అతని సహాధ్యాయి 'పెట్రోటోరిగిన్' పోట్లాట పెట్టుకొని కొట్టుకోవటం దాకా తీసుకొని వచ్చాడు. అప్పుడు జరిగిన కొట్లాటలో మైఖలాంజిలోకి ముక్కు ఎముక విరిగి, ముక్కు వంకరబోయింది. జీవితమంతా అనాకారిగా జీవించవలసి వచ్చినందుకు అతను చివర వరకూ సిగ్గుపడుతూ, అంతర్ముఖునిగా ఉండిపోయాడు. పట్టుమని పదహారు సంవత్సరాల వయస్సు రాక పూర్వమే 'బేటిల్ ఆఫ్ సెంటారస్" (Battle of Centaurs), "మెడొనా ఆఫ్ దిస్టెయిర్స్" (Madona of the stairs) అన్న శిలాఫలకాలను తీర్చి దిద్ది ప్రపంచాన్నే అబ్బుర పరచాడు.

క్రీ॥శ॥ 1492 వ సంవత్సరంలో ఫ్లొరెన్స్‌ను పాలిస్తున్న 'లొరెంజో మెడిసీ' మరణంతో ఏర్పడిన రాజకీయ అస్థిరతతో సామాజిక జీవనం గందరగోళంలో పడింది. దానితో క్రీ॥శ॥1495వ సంవత్సరంలో ఫ్లొరెన్స్‌ను విడచి రోమ్ నగరానికి చేరుకున్నాడు. క్రీ॥శ॥ 1500 సంవత్సరంలో శిల్పాకళామతల్లి మెడలో కౌస్తుభహారంగా పరిగణించబడే 'పిమెటా' (Pieta, కరుణ) అన్న శిల్పాన్ని చెక్కి యూరప్ దేశాలను అబ్బురపరిచాడు. అప్పటికతని వయస్సు ఇరవై అయిదు సంవత్సరాలు. ఈ శిల్పంలో మేరీమాత నిర్జీవమైన ఏసుక్రీస్తు భౌతిక శరీరాన్ని తన ఒడిలో నుంచుకొని మాతృప్రేమతో స్పృశిస్తున్నట్లుగా చెక్కబడింది. ఈ శిల్పంలో మేరీమాత గొప్ప సౌందర్యంతో, దుఃఖం వ్యక్తపరచబడని, గంభీరమైన మౌనంతో తన కుమారుని చూస్తున్నట్లుగా వుంటుంది. క్రీస్తు క్రింద వుంచబడిన వస్త్రం మడతలతో సర్వాంగ సుందరంగా కనబడుతుంది. క్రీస్తు వదనం ప్రశాంతంగా ఉంటూ కుడిచేతిని క్రిందకు జారవేసినట్లుగా రూపొందించాడు. ఈ శిల్పంలో చేతిక్రింద వుండే అతిసన్నని నరాలను సయితం స్పష్టంగా శిల్పించాడు (మిసిమి ముఖ చిత్రం). ఈ భంగిమ తరువాత ఎందరో చిత్రకారులకు స్ఫూర్తినిచ్చింది. ఫ్రెంచి విప్లవం నాటి డేవిడ్ అనే చిత్రకారుడు మారత్ మరణం అన్న చిత్రాన్ని ఈ భంగిమ స్ఫూర్తితో చిత్రించానని చెప్పుకున్నాడు. ఈ శిల్పాన్ని చూస్తున్న ఒక వ్యక్తి పక్కవానితో దీని శిల్పిగా మరొకని పేరు చెప్పడంతో అది విన్న మైఖలాంజిలో ఆశిల్పంలోని మేరీ పైటపై "ఈ చిత్రాన్ని చెక్కినవాడు మైఖలాంజిలో బొనరోటస్, ఫ్లొరెన్స్ నివాసి" అని చెక్కుకున్నాడు. అతను తన శిల్పమని పేర్కొని, సంతకం పెట్టిన శిల్పమిదొక్కటే. ఈ శిల్పం అప్పటి నుండి ఇప్పటి వరకూ వేటికన్ లోని సెయింట్ పీటర్స్ బాసిలికాలోనే వుంది. పంతొమ్మిది వందల డెభై దశకంలో ఒక ఉన్మాది స్తుతితో క్రీస్తు చేతిని పగులగొట్టాడు. అయితే అది తరువాత తిరిగి అతికించబడింది. ఈ శిల్పంతో మైఖలాంజిలోకి పేరు ప్రఖ్యాతులు, డబ్బు దస్కం పుష్కలంగా లభించింది. తండ్రిని, తన నలుగురు సోదరులను పోషించే సామర్థ్యానికి చేరుకొని తన తండ్రి కలలను సాఫల్యం చేశాడు.

చాలా రాజకీయ ఒడుదుడుకుల అనంతరం ఆగష్టు 4వ తేది, 1501 వ సంవత్సరంలో ఫ్లొరెన్స్ నగరం గణతంత్ర రాజ్యంగా వెలిసింది. ఆ సంగతి తెలుసుకున్నా మైఖలాంజిలో రోమ్ నగరాన్ని విడచి తిరిగి ఫ్లొరెన్స్ చేరుకున్నాడు. కొత్తగా వచ్చిన అధికారులు బైబిలోలోని డేవిడ్, గోలియత్ కథ ఆధారంగా డేవిడ్ యొక్క శిల్పాన్ని చెక్కవలసిందిగా ఆదేశించారు. 1501 నుండి 1504 వరకూ మూడు సంవత్సరాల అవిరామ కృషి అనంతరం 'నభూతోనభవిష్యతి అన్న విధంగా ఈ శిల్పాన్ని మలిచాడు. పద్నాలుగున్నర అడుగుల ఎత్తున్న ఈ పాలరాతి శిల్పం పూర్తి నగ్నంగా వున్న ఒక నవ యువకుని బలీయమైన శరీరాకృతిని అసభ్యతకు తావివ్వకుండా ఎంతో సుందరంగా మన ముందుంచుతుంది. ఈ శిల్పం నాభి నుండి పాదాల వరకూ చూపరుల దృష్టికి ప్రత్యక్షంగాను, నాభిపైనుండి తలవరకూ కొద్దిగా ఎడమ వైపుకు తిప్పబడివుంటుంది. ఐరోపా శిల్పాలలో ఎక్కువ భాగం ఈ భంగిమలోనే వుంటాయి. దీనిని 'Centra posto' అని పిలుస్తారు. ఒక రాయిని నొక్కి పట్టుకొన్న కుడిచేయి పిడికిలి, వడిశెలను భుజంపై వేసుకొన్న ఎడమచెయ్యి, దుర్నిరిక్షణమైన డేగ చూపు, ముఖంలో ఆత్మవిశ్వాసంతో ఈ డేవిడ్ శిల్పం తొణికిస లాడుతుంది. మొదట్లో ఫ్లొరెన్స్ ఊరి మధ్యలో నున్న ఈ శిల్పాన్ని దావించీ సలహాతో మరో భద్రమైన స్థలానికి మార్చారు. తిరిగి 19వ శతాబ్దంలో దీనిని ఫ్లొరెన్స్‌లోని అకడిమియా అన్న చోటుకు తరలించారు. 2004 వ సంవత్సరంలో ఈ శిల్పానికి 500 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో, 'పాల్‌గోర్నీ' అనే ఆమె (క్యూరేటర్) దీనిని 9 నెలలపాటు డిస్టిల్‌వాటర్, సెల్యులోజు గుజ్జుతో శుభ్రపరచి 500 సంవత్సరాల మడ్డిని వదలించి డేవిడ్‌ను అభ్యంగన స్నానమొనర్చింది. దీనికయిన ఒకకోటి ఎనభైలక్షల ఖర్చు చందాలు వేసుకొని ఫ్లొరెన్స్ ప్రజలే భరించారు. సౌందర్యభావనలో పిమెటా, డేవిడ్ శిల్పాలతో సరితూగ గల శిల్పం మరేదీ లేదని ప్రపంచ వ్యాప్తంగా కళాభిమానులు భావిస్తారు. కేవలం డేవిడ్ చిత్రం చూడడానికి వచ్చే టూరిస్టుల సంఖ్య సుమారు 3 కోట్లు. మనదేశంలో తాజమహల్ చూడడానికి వచ్చే అతిథుల సంఖ్య ఆరు కోట్లు. అయితే జూదానికి ప్రసిద్ధి గాంచిన లాస్ వెగాస్‌ను చూచే ప్రజల సంఖ్య పన్నెండు కోట్లు (2005 వరల్డ్ టూరిజమ్ అంచనాల ప్రకారం). 1508 వ సంవత్సరంలో మైఖలాంజిలో జీవితంలో సువర్ణాధ్యాయం ప్రారంభమయింది. రోమ్‌నగరంలో మతగురువైన రెండవ జూలియస్ సిస్టయిన్ చర్చిని పునఃనిర్మిస్తూ మైఖలాంజిలోకి ఆహ్వానం పంపాడు. మొదట్లో శిల్పాలు చెక్కవలసినదిగా కోరినాడు. అయితే రోమ్‌లో వుండే బ్రమెంటో అనబడే మరో శిల్పాచార్యుడు మైఖలాంజిలో శిల్పాలు చెక్కుతూ పోతుంటే అతని ఖ్యాతి అంబరాన్ని తాకవచ్చనే అసూయతో అతను శిల్పాల బదులు, కుడ్యచిత్రాలు వేయడానికి మైఖలాంజిలోని ఉపయోగించమని పోప్‌కు సలహా ఇచ్చాడు. ఆ సలహాతో ఏకీభవించిన పోప్ చిత్రాలు వేయమన్నపుడు మైఖలాంజిలో సరిగా స్పందించలేదు. తాను స్వతహాగా శిల్పినని, చిత్రాలు వేయటం తనకు ముఖ్యం కాదని, ఆపనికి దావించినిగాని, రాఫెల్‌నుగాని నియమించ వలసినదిగా కోరాడు. అయితే పోప్ పట్టుబట్టటంలో అయిష్టంగానే ఆపనికి పూనుకున్నాడు. నాలుగు సంవత్సరాల కఠోర పరిశ్రమ తరువాత దేదీప్యమానమైన అతని చిత్రాలను చూసి ప్రపంచం నివ్వెరబోయింది. నక్షత్రకాంతిని నట్టింట నిలపాడు. అనేక విషయాలలో పోప్‌తో తగాదపడి, తన పనిలో ఆయన కలుగ జేసుకోవటంతో ఒకసారి పనిమధ్యలో వదలి వెళ్ళాడు కూడా.

ఈ నాలుగు సంవత్సరాల కాలంలో విరామ మెరుగని మహావేశంతో, తీవ్రమైన ఏకాగ్రగతతో పనిచేసి ఆరోగ్యాన్ని అలక్ష్యం చేశాడు. ఆకలి వేసినపుడో, గుర్తొచ్చినపుడో రొట్టెలు తినేవాడు. కాలి బూట్లను విప్పకుండానే నిదురించేవాడు. వెల్లికిలా పడుకొని చిత్రాన్ని వేయటం వలన ఆతరువాత చాలా కాలంవరకూ ఏదైన చదవవలసి వచ్చినపుడు మెడను వెనుకకు వాల్చి తలను పైకి ఎత్తి మాత్రమే చదవగలిగేవాడు. ఈ కుడ్యచిత్రాల నిర్మాణం ఒక ఇతిహాసం. సిస్టయిన్ చర్చి ప్రాంగణం 40 అడుగుల వెడల్పు, 130 అడుగుల పొడువుతో వుంటుంది. అంతే ప్రమాణంలో 60 అడుగుల గరిష్ఠ ఎత్తున చర్చి పైకప్పు. మొదట్లో బైబిల్‌కు సంబంధించిన కొన్ని పురాణగాధలు గోడలకు రెండు వైపులా చిత్రించబడ్డాయి. పై కప్పుమాత్రం ఆకాశాన్ని పోలివుండేలా పూర్తిగా నీలం రంగుతో పెయింట్ చేయబడింది. ఆపైకప్పుకు ఆధారంగా త్రికోణ ఆకారంలో చెరొక ఆరుబ్రాకట్‌లు వున్నాయి. వీటిలో క్రైస్తవ మతానికి చెందిన కొందరు ప్రవక్తల చిత్రాలను వేయవలసినదిగా పోప్ మైఖేల్‌ను ఆదేశించాడు. అయితే వీటితోబాటు మైఖేల్ పై కప్పుమొత్తం చిత్రాలతో నింపితేనే కళకడుతుందని భావించి, పోప్‌ను ఒప్పించి, ఈ బృహత్ ప్రణాళికకు శ్రీకారం చుట్టాడు. అయితే చర్చికి వచ్చేపోయే జనసందోహంతో మతపరమైన కార్యక్రమాలకు విఘాతం కలిగించకుండా పనిచేసుకుంటూ పోవటం అనేది ఒక పెద్ద సమస్యగా మారింది. పై కప్పుపై చిత్రాలు వేయడానికి ఒక పెద్ద మంచె నిర్మించబడింది. పోప్‌కుగాని, ప్రజలకు గాని ఆటంకం కలుగకుండా మైఖలాంజిలో ఈ మంచెనిర్మాణాన్ని తానే గీసి చూపించారు. పైకి ఎక్కడానికి జిగ్ జాగ్ గా నిచ్చెనలు వుండేవి. సున్నం రంగులు తీసుకొని వెళ్ళడానికి వీలుగా విశాలంగా మెట్లు నిర్మించబడ్డాయి. పోప్ జూలియస్ 60 సంవత్సరాల వయస్సులో కూడా పైకి వెళ్ళి పనులను పర్యవేక్షించేవాడు. ఈ కళారాధనలో తనకు తోడ్పాటుకోసం కొందరు యువ కళాకారులను ఫ్లారెన్స్‌నుంచి రప్పించుకున్నాడు మైఖలాంజిలో. ఇందులో జాగబ్ ఇండికో అనే ఒక్క విద్యార్థిని తప్ప మిగిలిన వాళ్ళందరినీ ప్రాథమిక మయిన పని అయిన వెంటనే పంపించివేశాడు. తన తృప్తికోసం తానే ఒక చేతి మీదుగా ఈ పని సాగించాడు. కుడ్యచిత్రాలు గోడతేమగా వున్నపుడే వేయవలసి వుంటుంది. గోడలుపైనున్న తడారని సున్నం కొంతరంగును పీల్చుకొని, కొంతరంగును విసర్జిస్తుంది. అది అనుభవం వల్ల మాత్రమే అవగాహన కలుగుతుంది. మొదట్లో వేయవలసిన చిత్రం యొక్క బాహ్యరూపాన్ని రేఖామాత్రంగా మైఖలాంజిలో ఒక రకమైన పెద్ద కాగితంపై వేశేవాడు. ఆ గీతలపై ఒక సన్నటి గుండుసూదితో చిల్లులు పెడతారు. తరువాత దానిని గోడపై ఆనించి బొగ్గు భస్మాన్ని దానిపై రుద్దుతారు, చిల్లులు గుండా వెళ్ళిన ఆ రంగు గోడపై వేయవలసిన చిత్రాన్ని రేఖామాత్రంగా సూచిస్తుంది. ఇక మిగిలిన రంగులువేయటం లాంటి పనినంతా మైఖలాంజిలో ఒక్క చేతిమీదుగా నడిపాడు. ఈ చిత్రం వేస్తున్నపుడు మైఖలాంజిలో వయస్సు 37 సంవత్సరాలు. అక్టోబరు 31, 1512 వ సంవత్సరంలో ఈ కళాఖండాలు ప్రజల ముందు కొచ్చాయి. ఇందులో బైబిల్ పాత నిబంధనలలోని తొమ్మిది గాథలు చిత్రించ బడ్డాయి. అవి "ప్రారంభంనుండి ప్రళయంవరకూ" సాగిన ఆ దృశ్యమాళిక ఈ వరుసలో సాగుతుంది.

1. తప్ప తాగి పడివున్న నోవా
2. వరద భీభత్సం
3. నోవా త్యాగం

4. ఆశ - ఆదాము, ఈవుల బహిష్కరణ

5. ఈవుకు ప్రాణం పోయటం.

6. ఆదాముకు ప్రాణం పోయటం

7. నీటినుంచి భూమిని వేరుచేయటం.

8. సూర్యుడు, చంద్రుడు, గ్రహాల పుట్టుక

9. భూమిపై వెలుతురును ప్రసరింప జేయటం.

సిస్టయిన్ చర్చిలో పనిపూర్తయి తిరిగి ఫ్లారెన్స్ వచ్చి అక్కడ 14 సంవత్సరాలు వున్నాడు. ప్రపంచానికి మైఖలాంజిలో ఒక గొప్ప కళాకారునిగా మాత్రమే తెలుసు. అతనిలో మరో పార్శ్వం కూడా వుంది. 1527 వ సంవత్సరంలో ఫ్లారెన్స్‌ను పాలిస్తున్న మెడిసే కుటుంబ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. ఆ ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలు జాగరూకులయినపుడు ప్రజల తరుపున కుంచె పక్కకు పెట్టి కత్తితో కదంతొక్కాడు. తనకూ మెడిసే కుటుంబానికి వున్న అనుబంధాన్ని ప్రక్కకు నెట్టి, సర్వమానవ సౌభాతృత్వాన్ని ఆశిస్తూ ఫ్లారెన్స్ నగరం గణతంత్రరాజ్యం కావాలని ప్రజల తరుపున యుద్ధం చేశాడు. మతం పట్లే కాదు సాటి మనిషి పట్ల కూడా తనకొక బాధ్యత వుందని గుర్తించినవాడు. ప్రజలలోని నిరసనకు, ఆగ్రహానికి వుద్యమ రూపం ఇచ్చినవాడతను. ఆనాటి అంతర్యుద్ధంలో ఫ్లారెన్స్‌కు మిగిలిన ప్రపంచానికి సంబంధం తెగిపోయింది. ఆ సమయంలో చర్చిలోని నేలమూలిగలో శవాలను భద్రపరచేచోట మూడు నెలలు అజ్ఞాతంగా గడిపాడు. ప్రజాగణతంత్రపు వైపు పనిచేసిన ఒక వ్యక్తి కుట్రతో తిరిగి మెడిసే కుటుంబమే రాజ్యానికి వచ్చింది. సామాన్యప్రజలు మరోసారి ఓడిపోయారు. ప్రజా విప్లవంలో పాల్గొన్న అందరికీ శిరచ్ఛేదం విధించబడింది. ప్రతిభావంతుడైన మైఖలాంజిలోను శిక్షించే ధైర్యం ఎవరికీలేకపోయింది. అయితే ముఖం చెల్లని మైఖలాంజిలో సెప్టెంబరు నెల 23, 1534 సంవత్సరంలో ఫ్లారెన్స్‌ను శాశ్వతంగా వదలి రోమ్ చేరుకున్నాడు.

మైఖలాంజిలో ఎక్కువగా ప్రజలతో కలిసి పోయే మనిషికాదు. ఐహిక వాంఛలపై మనస్సు పడేవాడుకాదు. తన రూపు రేఖా విలాసాలపై, దుస్తులపై శ్రద్ధ వుండేదికాదు. అతనికి ఆత్మీయులైన వారు ఇద్దరే. ఒకరు రాజ కుటుంబానికి చెందిన థామస్ కవలేరి, రెండవ వ్యక్తి అతని జీవన నిర్దేశకురాలయిన ఏకైక మహిళ "విట్టోరియాకీలోనా". ఆమె కాథలిక్, రచయిత్రి. అప్పటికి మైఖలాంజిలో వయస్సు 61. ఆమెది 46. ఆమె సాంగత్యం అతన్ని ఆనంద డోలికలలో ఊగిస లాడించింది. ఆమెను వర్ణిస్తూ ఎన్నోగేయాలు వ్రాశాడు. తానువేసిన కొన్ని చిత్రాలను ఆమెకు కానుకగా పంపాడు. పదిసంవత్సరాల ప్రేమ అనంతరం ఆమె 1547లో మరణించింది. అతను మరింత ఒంటరి అయ్యాడు. ఆమెను అధికారకంగా వివాహం చేసుకోలేదు. జీవితమంతా అతను అవివాహితునిగానే వుండి పోయాడు. వారిద్దరి మధ్యన వున్నది ఒక అలౌకికమైన ప్రేమ బంధమని. మైఖలాంజిలో జీవిత చరిత్ర వ్రాసిన వేసరి పేర్కొన్నాడు.

తన అరవై ఆరవ సంవత్సరంలో 29 సంవత్సరాల అనంతరం సిస్టయిన్ చర్చిలోని ప్రార్థన మండపం అగ్నికి ఆహుతి అయితే తిరిగి ఆప్రదేశాన్ని అంతిమ న్యాయనిర్ణయం (The Last

Judgement) అనే ఒక కుడ్యచిత్రం (మిసిమి 4వ అట్టపై చిత్రం) మైఖలాంజిలో వేయవలసి వచ్చింది. సామాన్యప్రజల ఊహకు విరుద్ధంగా బలమైన కండలతో బలిష్టునిగా జీసస్‌ను చిత్రించాడు. ఇది ఆనాడు విమర్శలను ఎదుర్కొంది. మైఖలాంజిలో చిత్రాలన్నిటిలోనూ వ్యక్తులు పురుషులయినా, స్త్రీలయిన బలిష్టంగా కండలు తిరిగినట్లుగా చిత్రించబడతారు. అతని చిత్రకళలోని బలము, బలహీనత, ప్రత్యేకత ఇదే. సిస్టయిన్ చర్చిలో వేసిన చిత్రాలలో మొత్తం చిత్రించిన వ్యక్తులు సంఖ్యసుమారు 300. ఇందులో ఒక వ్యక్తి భంగిమకు మరొకవ్యక్తి భంగిమకు పోలిక ఉండదు. మైఖలాంజిలో చిత్రాలలో దావించీ, రాఫెల్ చిత్రాలలో కనిపించని ఒక వేగం, సంఘటనను, రకరకాల భంగిమలలో నున్న జనసందోహంతో సామాజిక జీవన చిత్రణ వుంటుంది.

మైఖలాంజిలో ముఖ్య కళాపోషకుడయిన జూలియస్ II 1514 వ సంవత్సరంలో మరణించాడు. అతడి సమాధి నిర్మాణం కారణాంతరాలవల్ల ఆలస్యమై చివరకు 1545లో పూర్తయింది. ఇక్కడ చెక్కబడిన శిల్పాలలో 'మోసెస్' (MOSES) శిల్పం ముఖ్యమైనది. హాలివుడ్ ప్రఖ్యాత దర్శకుడయిన సివిల్-బి-డిమిల్ నిర్మించిన టెన్ కమాండ్ మెంట్స్ చిత్రంలో మెసెస్ యొక్క రూపురేఖలను దీనినుంచే స్వీకరించారు.

రోమ్ నగరంలో వున్న సెయింట్ పీటర్స్ చర్చి మైఖలాంజిలో వాస్తుకళా నిర్మాణానికే మచ్చుతునక. క్రైస్తవ మతంలో గొప్ప మతాచార్యునిగా పేరుగాంచిన సెయింట్ పీటర్ సమాధిపై చార్లిమెన్ నిర్మించిన చర్చి పాతబడి శిధిలావస్థకు చేరుకుంది. 800 సంవత్సరాలుగా అది ప్రపంచ క్రైస్తవుల ముఖ్యకేంద్రంగా పరిగణించబడేది. ఈ చర్చిని పునః నిర్మించే బాధ్యత పోప్ రెండవ జూలియస్ తీసుకున్నా అది ఎందుకో ముందుకు సాగలేదు. మైఖలాంజిలోకు 71 సంవత్సరాల వయస్సపుడు అతనికి పూర్తి స్వేచ్ఛనిస్తూ దానిని ప్రపంచంలోనే గొప్ప కట్టడంగా నిర్మించమని కోరారు క్రైస్తవ మతగురువులు. మైఖలాంజిలో జీవితకాలంలోనే ఈచర్చి ఎక్కువభాగం పూర్తయింది. అంతకు ముందున్న భవన నిర్మాణ ప్రణాళికను మైఖలాంజిలో పూర్తిగా మార్చివేసి వాస్తుశిల్పిగా తనదైన ముద్రవేశాడు. ఈ చర్చి డోమ్‌లో నిబిఢీకృతమైన సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానం ఈనాటికీ ఇంజనీర్లను అబ్బుర పరుస్తుంది. పూర్వపు శక్తి వుడికిపోయినా, జవసత్వాలు సడలినా జీవన తుది ఘడియ వరకూ కళాతపస్సు కొనసాగించాడు. ఫిబ్రవరి 12, 1564వ సంవత్సరంలో వర్షంలో తడుస్తూ వ్యాహాళి నుంచి తిరిగి వస్తూ మంచంపై బడి ఆరురోజుల తరవాత ఫిబ్రవరి 18, 1564వ సంవత్సరంలో 90 సంవత్సరాల వయస్సులో మరణించాడు. ఇటలీయేకాదు, ఐరోపా ప్రజ మొత్తం దుఃఖంలో మునిగిపోయారు. అతని అంత్యక్రియలు అతని కోరిక ననుసరించి ఫ్లారెన్స్‌లో జరిగింది. అతని భౌతిక కాయాన్ని రోమ్‌నుంచి రహస్యంగా ఫ్లారెన్స్ తరలించవలసివచ్చింది, రోమ్ ప్రజలు అతనిని రోమ్ నుంచి తరలించడానికి ఇష్టపడరనే భయంతో. అతని అంత్యక్రియలు ఎంతో వైభవోపేతంగా జరిగినట్లు ఆతని బయోగ్రాఫర్ అయిన వేసరి పేర్కొన్నాడు.

మైఖలాంజిలో ఒక కళావిరాట్ స్వరూపం. శిల్ప శైలి అతనితో ఒక పరాకాష్ఠకు చేరుకుందని అనేకమంది భావిస్తారు. చిత్రలేఖనంలో వున్న కావ్యాత్మకతను శిల్పంలోకి మరల్చగలిగాడు. ఈ యుగాంతం వరకూ నిలబడే ఖ్యాతి అతనిది.

(ఈ నెల మిసిమి నాలుగు అట్టలపై చిత్రాలు వీరివే)

# సంగీతానికి శాస్త్ర సాంకేతిక విజ్ఞానం తోడ్పాటు?

**- నాగసూరి వేణుగోపాల్**

సంగీతానికి సంగీతాభిమానుల చేయూత గురించి చర్చించుకోవడం చూశాం. కానీ, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం తోడ్పాటు ఏమిటా - అని మొదట అనిపించవచ్చు. కానీ, కాస్త తరచి చూస్తే సంగీతానికి శాస్త్ర విజ్ఞానం యిచ్చిన తోడ్పాటు ఎనలేనిదని బోధపడుతుంది. నిజానికి ఈ విషయంలో వేరే వాదం వుండే అవకాశం లేదు.

వాస్తవానికి సంగీతానికీ, శాస్త్ర విజ్ఞానికీ స్ఫూర్తి ఒకటే! అదే ప్రకృతి. ప్రకృతిని పరిశీలించి, ప్రేమించి, అనుకరించడానికి ప్రయత్నం సాగుతుంది. ఈ అనుకరణ అనేది క్రమంగా మెరుగుపడడం జరుగుతుంది. దీనికే తర్వాతి స్థాయిలో యంత్రాలు దోహదపడే రీతిలో తయారవుతాయి. అవే సంగీత వాయిద్యాలు. ఇక్కడ సంగీతంలోని సృజనకు, శాస్త్ర విధానంలోని సృజన కలసి కొత్త సంగీత పనిముట్లు రూపొందడానికి ఆస్కారం కలిగింది. ఈ దశను సంగీత పరంగా చూస్తే సంగీత వాయిద్యాల తయారీగా పరిగణించవచ్చు. అదే శాస్త్ర విజ్ఞానం రీత్యా చూస్తే- ఇన్‌స్ట్రుమెంటేషన్ దశగా లెక్కించవచ్చు. అవసరానికి తగ్గట్లు పరికరాలు తయారు చేసుకోవటమే - పరిశోధనలు 'ఇన్‌స్ట్రుమెంటేషన్' అంటాం.

నిజానికి మాట్లాడితే మానవ శరీరమే ఒక అద్భుత పరికరం. ఈ సజీవ పరికరం ద్వారానే సంగీతం ఉద్భవిస్తోంది. మానవశరీర నిర్మాణం బోధపడడం ద్వారా సంగీత ధ్వనులు ఎలా పుడుతాయో, పరిణామం చెందుతాయో క్రమంగా బోధపడసాగింది. గాలి పీల్చుకోవడం, వదలడం సంగీతంలో ఎంత ప్రధానమో చెప్పక్కరలేదు.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ద్వారా సంగీత వాయిద్యాలు చేతుల్లోనో, చెంతలోనో చేరి మరింత హృదయంగమమైన సంగీతం తయారవడానికి దోహదపడడం ఒక దశ అనుకుంటే - తర్వాత స్థాయి మైక్రోఫోన్, రికార్డింగు సౌకర్యం! కేవలం కొందరికోసమో, లేదా అందిన వారి కోసమో - కాక మరింత శాశ్వతత్వం పొందడానికి దోహదపడింది సాంకేతిక విజ్ఞానమే! సాహిత్యం అక్షరంగా మారి గ్రంథస్థమై శాశ్వతత్వం పొందేది. అలాంటి అవకాశం లేనిది వాక్కు! అదే సంగీతం. ఈ పరిమితిని పటాపంచలు చేసింది శాస్త్ర సాంకేతిక విజ్ఞానమే! పూర్వం మహర్షులు వేదం ఎలా ఉచ్చరించారో మనకు తెలియదు కానీ, ఘంటసాల గొంతు ఎలా వుండేదో మనకు తెలుసు, ఎలా? మహర్షుల కాలంలో వారి గళాన్ని భద్రపరిచే టెక్నాలజి లేకపోవడమే కారణం.

అంతకుమించి సంగీతాన్ని ప్రజాస్వామ్య బద్ధం చేసింది కూడా టెక్నాలజియే! గొప్ప గాయకుడి గానం పెద్ద ధనవంతుడికో, అధికారికో సాధ్యం కానీ సామాన్యుడికి వీలులేదు ఇది గతం. టేప్ రికార్డర్, రేడియో వంటి ఆధునిక సాధనాలు రావటంతో ఎక్కువ మంది ఒకేసారి అంతేకాదు ఎంతో దూరం నుంచి కూడా పొందే అవకాశం టెక్నాలజి వల్ల సాధ్యపడింది.

---

నాగసూరి వేణుగోపాల్, ప్రస్తుతం విశాఖపట్టణం ఆలిండియా రేడియోలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నారు, బహుగ్రంథకర్త.

సంగీతం మరింత రక్తి కట్టడానికి కూడా దోహదపడింది టెక్నాలజియే! ఉదయరాగం ఉదయంపూట పాడాలి. మరో రాగం మరో సమయంలోనే పాడాలి, వినాలి. ఈ పరిమితిని కూడా అధిగమింప చేసింది సాంకేతిక విజ్ఞానం. ఎందుకంటే వాతావరణం సృష్టించగల ఆడిటోరియం నిర్మాణాలవల్లనే యిది వీలయ్యింది. భవిష్యత్తులో వర్షం, మేఘం, కొండ కోనలు, పిల్లగాలి, తుంపరగా పడే వర్షం వంటి 'వర్చువల్ అట్మాస్ఫియర్ ఆడిటోరియం' వచ్చే అవకాశం ఎంతగానో వుంది.

కొందరి గొంతులను 'రేడియో జెనిక్' అని అంటుంటారు - మొహాలను 'ఫోటో జెనిక్' అన్నట్టు! సామాన్యుల భాషలో చెప్పాలంటే ఒదగటం లేదా నప్పడం. వాస్తవానికి ఏ మానవ నిర్మిత పరికరం వంద శాతమూ అనుకరించలేదు. కొంత విహపానికి గురవుతుంది. అయితే యిది కొన్నిసార్లు ఆ గొంతుకకు దోహదపడి శ్రావ్యతను పెంచవచ్చు. లేదా మరికొన్ని సార్లు శ్రావ్యతకు భంగం కల్గించవచ్చు. "రేడియో జెనిక్", "మైక్రోఫోన్ జెనిక్" అంటే సరళంగా ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు. కారణం ఏమైనా, యిది సాంకేతిక విజ్ఞానం దోహదపడటమే అవుతుంది కదా!

అధునాతన సాంకేతిక విజ్ఞానంతో మెరుగుపరిచే అవకాశం కూడా వుంది. రికార్డింగు పాతబడినపుడు, లేదా పాడయినపుడు - మెరుగు పరచడమో, శుభ్రపరచడమో కూడా సాంకేతిక విజ్ఞానం వల్ల నేడు సాధ్యం. హార్మోనియం లాంటివి గాయకుడి చిన్న చిన్నలోపాలు అధిగమించడం మనకు తెలిసిందే! ఇక పాశ్చాత్య సంగీతం విషయానికి వస్తే సాంకేతిక విజ్ఞానం తోడ్పాటు లేకపోతే నేడు పాశ్చాత్య సంగీతాన్ని మనం ఊహించలేము. గేయం రాసుకుని, స్వరాలు కూర్చుకుని, పాడుతూ, నృత్యం చేయడం పాశ్చాత్య సంగీతంలో పరిపాటి. వీటికి సాంకేతిక విజ్ఞానం దోహదపడి మైక్రోఫోన్, రంగురంగుల వేదిక, స్పీకర్లు, ఎన్నెన్నో అధునాతన సామాగ్రి లేకపోతే వారి సంగీతం రక్తి కట్టదు.

సంగీత శాస్త్ర సాంకేతిక విజ్ఞానం గురించి మాట్లాడుకున్నపుడు మరికొన్ని విషయాలు ముచ్చటించుకోవాలి. గ్రామఫోన్ రికార్డు నుండి టేపురావడం గొప్ప సౌలభ్యం, ఖర్చు తక్కువ. అయితే నాణ్యత తక్కువేనని మనం ఒప్పుకోవాలి. అదే ఆడియో సి.డి. ఈ లోపాన్ని పూరిస్తూ - నాణ్యతను దెబ్బతీయకుండా - ప్రవేశించింది. అనలాడ్ రికార్డింగ్ స్థానంలో డిజిటల్ రికార్డింగ్ రావడం యిటీవలి పరిణామం. డిజిటల్ రికార్డింగ్‌లో ఎన్ని అద్భుతాలు సాధ్యమైనా, అనలాడ్‌లోని నాణ్యత రావడం లేదని ఒక పరిశీలన.

మరి ఈ సంగీత యానంలో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఎంత దోహద పడిందో, ఈ విషయంలో మరే అంశమైన యింత తోడ్పడిందో - మనం చెప్పగలమా? అందుకే శాస్త్ర సాంకేతిక విజ్ఞానం దోహదపడినట్టు మరేది సంగీతానికి తోడ్పడలేదనేది నిర్వివాదాంశం!

(కాకినాడ - సంగీత విద్వత్సభ వజ్రోత్సవాలలో భాగంగా 2006 జనవరిన రచయిత చేసిన ప్రసంగానికి సంక్షిప్త రూపం)

# కథన రీతులలో ఆరితేరిన వృద్ధమూర్తి

## ('యశోద కొడుకు' కథా రచయిత మునిపల్లె రాజు)

- 'శ్రీ విరించి'

గ్రామ వాతావరణంలో - చదువులలో వున్నప్పుడే - ఒక అమ్మాయిని ఆమె యిష్టాన్ని అనుసరించే 'కలుసు' కుంటాడు. ఆమెను వివాహం చేసుకోవటానికి మటుకు సంస్కృతి, వంశమర్యాదలు, కులము అడ్డువస్తాయి. తరువాత అతను పేరుపొందిన పెద్ద 'లాయర్'గా వున్నప్పుడు, చనిపోతున్న ఆమె తన కొడుకును 'ఓడిపోయిన కేసు తాలూకు కాగితాలు' యిచ్చి అతని దగ్గరకు పంపుతుంది. తండ్రి కొడుకును గుర్తుపట్టగలుగుతాడు, పైకి మాత్రం 'మాట' తేలడు. రహస్యం తనతోనే అంతరించి పోవాలా-అని వికిత్స వుండిపోతుంది:

"నువ్వు నా రక్తానివి, నా కొడుకుని అని నిజం చెప్పి తన తల్లి మీద అనన్యభక్తిని, గౌరవాన్ని తుంచివేయనా? లేక నా జీవితాంతం నాకున్న ఒక్క పుత్రుడినీ నాక్లయింట్‌గానే పరిగణించనా?"

కొడుకును 'లా' చదివించి తన దగ్గరే మూడో జూనియర్‌గా తయారు చేస్తాడు. - ఇదీ స్థూలంగా కథ.

★ ★ ★ ★

ఈ కథ జరుగుతూవున్నట్లుగా కథనరీతి వుండదు. కథనానికి లోకల్ 'కలకత్తా నుంచి మదరాసుకు వెడుతున్న మెయిల్ ట్రెయిన్.' కథకు కీలకం అయిన సంఘటన జరిగిన తరువాత దాదాపు ఇరవై యేళ్ళకు 'ఫ్లాష్‌బ్యాక్' గా కాకుండా, కథానాయకుడు తన స్నేహితుడికి ప్రత్యక్షంగా చెబుతాడు.

'యశోద కొడుకు' నవలికగా జూన్ 1987 'స్వాతి' మాసపత్రికలో ప్రచురణ అయింది. క్రౌన్ ఆక్టోవ్‌లో 24 పేజీలు. దీనిని నవలిక అనడం కంటె, కథానిక అనడమే లక్షణం. తరువాత, ఈ కథ శ్రీరాజుగారి కథా సంపుటాలలో చోటు చేసుకుంది. కళాసాగర్ (చెన్నై) వాళ్ళు తమ రజతోత్సవ కానుకగా 1997లో తీసుకు వచ్చిన 'కథాసాగర్' బృహత్ సంకలనంలో స్థావరించుకుంది. ఈ కథను పరిచయం చేస్తూ కథాసాగర్ వ్రాసిన ముందుమాటలు యిలా ఉన్నాయి:

ప్రతిమనిషికీ ఒక గూఢ ప్రపంచం. అందులో ఇతరులు చొరబడటానికి వీల్లేని మారుమూలలెన్నో వుంటాయి. సదాశివరావు తన మనసులోని ఒక మరుగును ఒకానొక ఆప్తమిత్రుడికి మాత్రమే చెప్పగలుగుతాడు. కనీసం ఒక్కరికైనా ఆ విషయం తెలిసి వుండడం అనేది, తాను యశోద కొడుక్కు చేయగలిగిన న్యాయంగా భావిస్తాడు. ఇంతకూ అతడు ఎవరు? ఈ కథ వ్రాస్తున్న సమయానికి శ్రీరాజుగారు 'మాజిక్ రియలిజమ్' గురించి తీవ్రంగా ఆలోచించలేదు. తమ కథలకు ఆపేరు పెట్టాలని అనుకోలేదు. అయినా అప్పటికే వారి మానస సరస్సులో మాజిక్ రియలిజమ్ తరంగాలు ఎగసెగసి పడుతున్నాయనడానికి ఈ కథానిక సాక్ష్యం. ఒక్క మాజిక్‌తో సరిపెట్టుకోకుండా ఈ కథనిండా సోషల్, ఎగ్జిస్టెన్షియర్, లిటరరీ రియలిజంలు కూడా బాహాటంగా కనిపిస్తాయి.

★ ★ ★ ★

---

శ్రీ విరించి (డా. యన్.సి. రామానుజాచార్యులు) ప్రసిద్ధ కథానిక రచయిత, చెన్నయ్, థియోసాఫికల్ సొసైటీలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్నారు.

కథాకాలం దాదాపు 1940-50 దశకం అయివుండాలి. రచన కాలం 1985-87 సంవత్సరాలు. దాదాపు 50 యేళ్ళకింది కథను చరిత్రను- ఇప్పుడు నెమరు వేసుకుంటూ ఆయాపాత్రల ద్వారానే చెప్పించడంలో ఎన్నో చమత్కారాలు తళుక్కున మెరుస్తూ వుంటాయి. వాటిని జాబితావేయాలంటే యివీ :

1. అప్పటి గ్రామ జీవనం, వాతావరణం.
2. అప్పటి యువకులు పట్టణాలకు వెళ్ళి చదువుకునే ప్రయత్నాలలో జయాలు, అపజయాలు.
3. ప్లీడరీ ప్రాక్టీస్ చేస్తున్న వాళ్ల అలవాట్లు, ఆంతరిక సంఘర్షణలు.
4. దేశంలో విభిన్న ప్రాంతాల మనుషుల వింత మనస్తత్వాలు- పరస్పర సంబంధాలలో అవలయలు.
5. మదరాసులో అప్పుడున్న 'ట్రాం' సర్వీస్.
6. బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ నుంచి ఖరీదైన సిగరెట్లు కాల్చడం అలవరచుకోవడం.
7. కులాంతర వివాహాల గురించి రహస్య ఆంతరికాలు.
8. అమ్మాయి మీద అధికారం సంపాదించాలనే ఆర్తి.
9. వేశ్యాంగన తమ కులంలోనే మనమరాలికి సంబంధం చేయాలని తాపత్రయ పడడం.
10. అగ్రజాతి వాడిని వివాహం చేసుకోకపోవటానికి బాలిక చెప్పిన కారణాలు.
11. స్వరాజ్య ఉద్యమంలో దేశప్రజలు చేసిన త్యాగాల స్వరూపం.
12. 'ధర్మ చింతన' గురించిన మౌన ఆవేదనలు.

దాదాపు నలభై, యాభై సంవత్సరాల సామాజిక చరిత్ర ఈ కథలో మిళితం అయివుంది. అప్పటి ఆచారాలు, ఆలోచనలతో బొత్తిగా పరిచయం లేని ఈనాటి చదువరులకు ఎన్నో కొత్త 'పాతసంగతులు' తెలిసి వస్తాయి.

★ ★ ★ ★

సృజనాత్మక రచనలలో చరిత్ర, సంస్కృతి తప్పనిసరిభాగం. సమకాలిక వాతావరణం యిలా కలిసిపోతుంది. గనుకనే తరువాతి దశకాలలో చదువుకున్నప్పుడు ఎన్నో మలుపులు, విరుపులు, వున్నట్లుగా కనిపిస్తుంది. చారిత్రక సంస్కృతిక పరిణామాలు దేశ చరిత్రలను నిర్మిస్తాయనేది వివాదాంశంకాదు. కాల్పనిక రచనలను విశ్లేషిస్తున్నప్పుడు ఈ సంగతి గుర్తుంచుకోవాలి. ప్రస్తుత 'మీటర్' కొలతలతో వెనకటి 'గజా'లను కొలవకూడదు. కొలత బద్దలు ఎప్పటి కప్పుడు మారిపోతూ వుంటాయి. ఈ మార్పుల్లో కొనసాగింపు ధోరణినే చూడాలి గాని, అప్పటి పరిస్థితులు ఇప్పుడు అతుకుతాయా లేదా అని పరీక్ష పెట్టకూడదు. నిజానికి, ఇప్పుడు మనం చేస్తున్న ఆలోచనలు కొన్ని - ఓ ఇరవై ముప్పై యేళ్ళ క్రితం 'అనూహ్యం', కృత్రిమం, అసహజం, గర్హనీయం కూడా! ఆలోచనలు సవరించుకుంటూ ముందుకు పోవడం మనిషిని, జాతిని, దేశాన్ని, నాగరికరీతులనూ నడిపిస్తుంది. 'అభిప్రాయాలకోసం బాధలు భరించడం, మరో ప్రక్రియ. ఆలోచనలు వేరు, అభిప్రాయాలు వేరు. ప్రాయాన్ని బట్టి అభిప్రాయాలు మారిపోతూ వుండడం సహజమైన సామాజిక-సాంస్కృతిక పరిణామమే.

స్త్రీకి జరిగిన - అను నిత్యము జరుగుతూవున్న - అన్యాయంగా ఈ కథను ఉదహరించవచ్చు.

మగవాడి పిరికితనాన్ని, పరిస్థితులకు ఒదిగిపోయే మనస్తత్వాన్ని సూచించటానికీ ఈ కథను చెప్పుకోవచ్చు.

గతంలో జరిగిన సాంఘిక అన్యాయాన్ని, సమకాలీనంలో చక్కదిద్ది భవితకు సాంఘిక న్యాయం చేకూర్చిన కథగా చూడవచ్చు.

సామాజిక విలువలను సాహిత్య విలువలను జోడించి కళాఖండంగా శిల్ప చాతుర్యంతో రూపకల్పన జరిగిన కథగా యిదొక నమూనా.

బాహ్య ఆడంబరాలకు తలవొగ్గక పోయినా ఆంతరిక సంక్షోభాలతో అల్ల కల్లోలం అయిన మానసిక విశ్లేషణం, 'కన్ను కానని వస్తు తత్త్వం' బహిరంగ పరిచే రచనా శకలంగా చెప్పుకోవచ్చు.

రచనకు సంబంధించి మునిపల్లెరాజు గురించిన వ్యక్తిగత వివరాలు:

విద్యార్థి దశలోనే రచన వ్యాసంగం ఆరంభించారు.

అప్పుడూ, ఉద్యోగ దశల్లోనూ విరివిగా ఇంగ్లీషు-యూరోపియన్ భాషల కల్పన సాహిత్యం, కవిత్వం చదివారు.

వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలు, రక్షణ శాఖలో- యుద్ధ వాతావరణంలో - చేసినందువల్ల జీవిత పరిశీలన మరింత సునిశితం అయింది.

కుటుంబ వాతావరణంలో, మార్పును కోరే ఆలోచనలు, సృజనాత్మకత ఎక్కువగా వుండిన మనుషుల మధ్య నివాసం.

భావాల ప్రభావాలను గుడ్డిగా అనుకరించడం కాకుండా, వాటిని సూక్ష్మతర దృష్టితో పరిశీలించి నిగ్గుతేల్చుకోవడం అలవాటు అయిన మనిషి.

రాజు ప్రచురించిన కథా సంపుటాలు: మునిపల్లె రాజుకథలు, పుష్పాలు-ప్రేమికులు-పశువులు, దివా స్వప్నాలతో ముఖాముఖి, మాజికల్ రియలిజమ్ కథలు. ఇవికాక - కవిత్వ సంపుటాలు రెండు. 'మిసలేనియస్' రచనలను కూడా కలెక్ట్‌చేసి వాటికి పుస్తకరూపం ఇచ్చే ప్రాజెక్ట్ యిప్పుడు చేపట్టారు.

★ ★ ★ ★

ఈ కథలో మనకు కనిపించే పాత్రలు: సదాశివరావు (కథానాయకుడు), నేను (కథ వ్రాస్తున్న వ్యక్తి. నాయకుడి స్నేహితుడు, యశోద, మాణిక్యమ్మ, 'శివ' అనే యశోద కొడుకు. తెరమీదకు రాని పాత్రలు : నేను కు తండ్రి (రాజకీయ అనుయాయి), యశోద నాన్న (ఇల్లరికం అల్లుడు), ఓంకారాచారి (బత్తుడు), నాగలింగం (యశోద భర్త), జోగారావు - వెంటాచలం (జూనియర్లు).

కథను ఎనిమిది సెక్షన్లుగా విభజించడంలో 'కథన రీతి' బహిరంగం అవుతుంది. ఇవి ఎలా వినియోగం అయినాయో చూద్దాం :

1. స్నేహితులు ఇద్దరి ప్రస్తుత ప్రయాణం (కలకత్తా నుంచి విజయవాడ దాక)

2. సదాశివరావు దగ్గరకు యశోద కొడుకు రికార్డ్ కట్ట తీసుకుని వచ్చి ప్రత్యక్షం అవడం.

3. రైలు ప్రయాణంలో సదాశివం తన స్నేహితుడికి (కథకుడికి) యశోదను, కథను పరిచయం చేయడం.

4. సదాశివరావుకు, కథకుడికీ పరిచయం - చదువులలోను, వృత్తిలోను వృద్ధి అయిన వైనం.

5. సదాశివరావు తమ గ్రామ వాతావరణాన్ని, యశోదతో పరిచయాన్ని విపులీకరించడం.

6. చంద్రహారం మరమ్మతు, అమ్మమ్మ కథకుడి తండ్రితో యశోద పెళ్ళిని గురించి ప్రస్తావించడం; యశోద తన కారణాలను చెప్పడం.

7. యశోద పెళ్ళి, వివాహం, జీవితం, రోగం, మృత్యువు

8. సదాశివరావు కథకుడిని తనతో పాటు మదరాసు దాకా రమ్మని కోరటం, మూడో జూనియర్ 'శివ' ను పరిచయం చేస్తాననటం, కథకుడు బండి దిగిపోవడం.

దుఃఖాలతో ఆవేదనలతో సతమతం అయిన కథ. సుఖాంతం అయినట్లు ఆనందిస్తాడు చదువరి.

★ ★ ★ ★

సంస్కృతి అంటే యిక్కడ పరం పరాగతంగా వస్తున్న సంప్రదాయసరణి అనుకోనక్కరలేదు. దీనికి అనుకరణ, తన చిత్తం ప్రసరించే కొత్త ఆలోచనల అనుసరణ కలిసిపోయి విశ్వజనీను, సర్వకాలికం అయిన పద్ధతికి దారితీసే పరిణామం.

అలాగే చరిత్ర అంటే పరిస్థితులకు (తేదీలు, సంవత్సరాలు) ఒదిగిపోయినట్లుగా ఉండకుండా స్వతంత్రంగా ఆలోచించగల చిత్త స్థైర్యం రూపకల్పన అవుతున్న వాతావరణం.

మనిషి ఆలోచించే పద్ధతికి, అనుసరించే విధానానికి మధ్య తప్పనిసరిగా ఉండే అడ్డుగోడలు చరిత్రను, సంస్కృతిని సమపాళంలో రంగరించుకుంటాయి. ఈ గోడలకు ఎన్నయినా పైపూతలు పూయవచ్చు, చేరవచ్చు, సాంఘికంగా తప్పు - ఒప్పు అయిన సందర్భాలు పడుగు పేకలలాగా ఈ గోడలను సురక్షితంగా కాపాడుతూ వుంటాయి. 'తిరుగు బాటు ధోరణి' యింకా పూర్తిగా చిత్త సంస్కారంలో కరుడు గట్టుకు పోకముందు వుండే స్థితి యిది.

తన కులం వాడితోనే పెళ్ళి జరిపించటానికి అమ్మమ్మ కారణాలు వివరిస్తుంది. అలాగే యశోద చెప్పిన కారణాలు కూడా 'గ్రౌండ్ రియాలిటీ'కి సన్నిహితంగా వుంటాయి. సదాశివరావు, యశోద యీ రెండు పాత్రలకూ జీవితంలో అన్యాయం జరుగుతుంది. ఈ అన్యాయాన్ని గురించి యశోద సమర్థించుకోగలిగితే, సదాశివం మటుకు చివరి వరకు సమాధాన పడలేకపోతాడు.అతడు బుద్ధివాది.

మాజిక్ రియలిజం స్పష్టంగా ప్రదర్శితం అయే పంక్తులు యిలావుంటాయి:

-ఒక నిట్టూర్పు వచ్చింది. అతనేదో తనలోనే శాశ్వతంగా దాగి వుండాల్సిన ప్రణయోదంతం వెలిగక్కబోతున్నాడని ఆ శబ్దం సూచిస్తున్నది.

- నాకేమీ అధికారంలేని నా బాల్య చెలిమికత్తె యశోద చంద్రహారం నేలమీద మెరుస్తూవుంది. విగతజీవి అయిన కాలసర్పం వలె అది తెగిపోయి వుంది.

-ఈ కాలం పదార్థం- వీటి మధ్య నివశిస్తున్న మానవుడు నిజంగా ఏకాకియేగాని వాటిలో భాగం కాదుగదా! ఏకాకిగానే ఆ దినమంత గడిపాను. పశువుల కొట్టంలో పాతమంచం మీద నిద్రపోయానో, జాగృతిలోనే వున్నానో తెలియని స్థితి. చీకటి పడుతూవుండగా, వెతుకుతూ నేను కనిపించక అక్కడకు వచ్చింది కాబోలు, ఏకాంతసేవ చేసే భక్తులకే వాడు దాగే స్థలాలు తెలుస్తాయా? వచ్చి మంచం మీద కూర్చుని తల్లివలె తల నిమిరింది; నాకేమీ అధికారం లేదన్నవ్యక్తి.

- స్వేచ్ఛగా కలిసిపోవాల్సిన పక్షిజంటలో ఆడపక్షి ఇచ్ఛికంగా ఒక బంగారు పంజరంలో జొరబడ్డది. తన రక్త సంబంధీకుల క్షేమం కోసం. ఇప్పుడు ఏకాకి పథిక అయిన మగపిట్టకూడా, తన వాళ్ళను దుఃఖంలో చూడజాలక యింకో పంజరంలోకి పోయింది. నాపెళ్ళి పంజారు. నగిషీ పంజరం.

- ఎక్కడో పర్వత శిఖరాల మీద పుట్టిన సెలయేరు తనమీద ఒక్క నీడకూడా పడకుండా యోజనాల దూరం ప్రవహిస్తూ అడవుల్లోకి అరణ్య గర్భాల్లోకి ప్రవేశించాక, ఆకూ అలముల్తో ఎండిపడిపోయిన వృక్ష శాఖల్తో మలినమైపోయి తనే ఛాయగా మారిపోతే యిక స్వేచ్ఛ జలం యివ్వగలదా?

మంచి కథకు మరో విలక్షణ లక్షణం-ఎక్కడ వర్ణనలు, ఎక్కడ సంభాషణలు ఉండాలనే విషయాలో వివక్ష. లిఖిత కావ్యం దృశ్యకావ్యం అవడం-మనసు, హృదయాల మీద చెరపరాని ముద్రవేయడం -అతి సహజంగా సమకూడుతాయి. అందుకనే కథానికను Lyric అనీ Drama అనీ సామ్యం చెబుతూ వుంటారు. Form (రూపం)తో Content (విషయం) తదాత్మ్యం చెందడంలోనే రసోత్పత్తి. ఈ రసానికి ఔచితి కూడా ప్రధానం అయినప్పుడే 'పలుకుబడి' పదికాలాల పాటు నిలుస్తుంది.

స్త్రీలు కీటకాలు, పురుగులు. అజ్ఞాన తమస్సులోనే మట్టిలోనే కలిసిపోతారు. ఇళ్ళలో పంజరాల్లో బిగించి మనకు ఇష్టం అయిన చోట వాళ్ళను పెట్టుకోవచ్చు - వంటింట్లోనో, పడకటింట్లోనో... అనే భావం నుంచి పెరిగి, తన అసమర్థతకు అకృత్యానికి 'తగిన' నిష్కృతి చేసుకున్న సదాశివం కథ యిది; తగిన పరిహారం చెల్లించి తల్లీ, తండ్రీ కోల్పోయిన ఒక యువకుడికి వృత్తి, ప్రవృత్తి చేకూర్చిన కథ ఇది. ఆ యువకుడు తన కొడుకే అవడం కథకు ఆయువుపట్టు. యశోద, సదాశివుడి జీవితాలు - కథకుడికి. వాళ్ళ పరిచయాలతోవున్న కమామిషు - సంస్కరణకు తగిన సమీకరణ సంవిధానం ఈ కథలో విడి విడి గుర్తులు తెలియకుండా కలివిడి అవుతాయి.

ఈ విభిన్న తీరుల్ని ఒక్కచోట చేర్చిన మానవ సమాజ స్థితి గతుల్ని బహునిపుణతతో, సూత్రప్రాయంగా కలిపి, కథ కట్టిన రాజు కథన రీతులలో ఆరితేరిన వృద్ధమూర్తి అనడం యదార్థానికి అద్దం పట్టటమే గాని ఏమాత్రం ముఖస్తుతి, అతిశయోక్తి కాదు.

# శ్రీశ్రీ, దాశరథి అధికారానికి దాసోహం అన్నారా?

- మద్దాలి సత్యనారాయణశర్మ

ప్రసిద్ధ సాహితీ వేత్త, కవి కోవెల సుప్రసన్నాచార్య 'అధికార సంకెళ్ళలో కవులు' అని ఆ మధ్య ఒక రచన ప్రచురించారు. 'రసలోకం' అనే నిర్దిష్ట శీర్షిక కింద వెలువడిన వారి రచనల పరంపరలో అది ఒకటి. ఆ రచనలో వారు ఇందిరాగాంధి పరిపాలనా కాలంలో 'అనుశాసనపర్వం' అనిపించుకున్న ఘట్టాన్ని ప్రస్తావించి, ఆనాడు శ్రీశ్రీ, దాశరథీత్యాది ఆంధ్రకవులు ఆమె చర్యను హర్షించటాన్ని, సమర్థించటాన్ని తప్పుపట్టారు. ఆరీత్యా ఆ రచయితలు అధికార సంకెళ్ళకు లోనైనారని ఈ ఆచార్యుని అభియోగం. ఎన్నడూ ఎవరికీ తలవంచని మన కవితల్లజులను ఆపాటిగా న్యూనపరచటం నచ్చక, ఇందిర చర్య జనహితకరమనిపించే, వారు ఆ ప్రశంసారచనలు చేసి వుంటారనీ, తమకు తోచినది చెప్పే స్వేచ్ఛ వారికి లేదా అనీ, రసలోకా లోకనంలో ఆ రచనలు సరసాలా, విరసాలా, అరసాలా అనేది తేల్చాలిగాని వారి చిత్తశుద్ధిని శంకించటం, అధికారానికి దాసులైనారని నిందించటం తగదనీ-ఆచార్య రచనను ప్రచురించిన పత్రికకే ఆ వెంటనే ఒక రచన పంపాను. అది ఎందుకనో బుట్టదాఖలు అయింది. అలవాటు ప్రకారం ఈమధ్య కాగితాల కవిలె తిరగేస్తూ వుంటే ఆరునెలల నాటి ఆ ఆచార్యుని రచన మళ్ళీ కళ్ళబడింది. అరె, ఈ సంగతిని నలుగురి దృష్టికి తీసుకు వెళ్ళటం పడలేదే అనిపించిన దాని పర్యవసానమే ప్రస్తుత ఈ రచన.

ముప్పయి ఏండ్ల క్రితం (1975లో) ఇందిరాగాంధి ఏదో దుర్ఘడియలో ఎవరి దుస్సలహాతోనో దేశంలో అవాంతర పరిస్థితి ప్రకటించి ప్రతికూలుర నోళ్ళు నొక్కే ప్రయత్నం చేసింది. ఏణ్ణర్థం తర్వాత ఆమే తన తప్పును గ్రహించి, పశ్చాత్తాపపడి, ఆ పరిస్థితిని రద్దుచేసి ప్రజాస్వామిక ఎన్నికలు నిర్వహించింది. చేసిన తప్పుకు తగిన శాస్తిని అనుభవించింది. మళ్ళీ ప్రజామోదంతో ప్రధానమంత్రి పదవినీ పొందింది. అయినా ఆమె అంటే విరోధం పెంచుకున్నవారు ఈనాటికీ ఆ అవాంతర పరిస్థితిని స్మరించుకుంటూ ఆమెపై విరసపు అక్షతలు వేస్తూనేవున్నారు. ఇది అంతా కేవలం ప్రసక్తాంశం మాత్రమే.

ఇందిరాగాంధి ఆనాడు ఆ 'అవాంఛనీయ' చర్య ఎందుకు తీసుకున్నదో-ఎవరి రాజకీయ అవగాహనను బట్టి వారు అర్థం చేసుకున్నారు. ఆ ప్రకారం ప్రతిస్పందించారు. దేశంలో అరాజకం తల ఎత్తే ప్రమాదం ఉందనీ, కనుక కఠినచర్య అవసరమేననీ భావించినవారు హర్షించారు. ప్రభుత్వ ప్రతికూలురు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు ముప్పు వాటిల్లిందని నిరసించారు. నిష్పాక్షికంగా చూస్తే అవాంతర స్థితి ఆరంభంలో ప్రభుత్వసంబంధ సకల కార్యక్షేత్రాలలో దైనందిన కార్యకలాపాల నిర్వహణ ఎంతో మెరుగుడు, ఎంతో మందికి, ఎంతో సంతోషం, సంతృప్తి కలిగించింది. దండం దశగుణం భవేత్ అన్నమాట ఉత్తపుణ్యానికి పుట్టింది కాదని అంతా, ఆశ్చర్యపడుతూనే, అనుకున్నారు. ఆచార్య వినోబా భావే వంటి శాంత పురుషుడు ఈ అనుశాసన పర్వంతో దేశం బాగుపడితే సంతోషమే అన్నారు. దేశంలో విచ్చలవిడి ప్రవర్తన ప్రబలి ప్రగతికి ప్రతిబంధకం అవుతూందనీ, జనజీవన సరళిలో క్రమశిక్షణ, కట్టుబాటు అవసరమనీ, నాటి సోవియట్ యూనియన్ జీవనసరళి మనకూ అగత్యమనీ అభిలషించిన వారు ఇందిర చర్యను హర్షించి, ప్రశంసించారు. శ్రీశ్రీ దాశరథీత్యాదులు చేసింది ఆపనే. వారికి తోచిన, నచ్చిన పనివారు చేశారు. అంత మాత్రాన వారిని ప్రభుత్వానికి దాసులైనారని నిందించటం, న్యూనపరచటం న్యాయమా? భావ్యమా? వారేమైనా తమ ఆనాటి రచనలవల్ల అక్రమమైన, అనుచితమైన స్వలాభ, ప్రయోజనాలను సాధించుకుంటే, 'అయోగ్యం'గా అందలాలేమైనా ఎక్కివుంటే ఆ మాట అనవచ్చు. అటువంటిదేమీ లేదే?

*(తరువాయి 367వ పేజీలో)*

మద్దాలి సత్యనారాయణశర్మ 'భారతి' సంపాదక వర్గంలో పనిచేశారు. హైదరాబాదు.

# 20వ శతాబ్దంలో తత్వశాస్త్రం - పురోగతి

- శివలింగం

20వ శతాబ్దపు తత్త్వ శాస్త్రం ఎంతవరకు పురోగమించిందనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టమే. అయినా ప్రయత్నిద్దాం. పాశ్చాత్య తత్వశాస్త్రం పందొమ్మిదో శతాబ్దానికి పూర్తి అయింది. అయినా శాశ్వతమైన ప్రశ్నలను, కొన్ని సమస్యలను చర్చిస్తూనే వున్నారు. తత్వశాస్త్రానికి భిన్నమైన విజ్ఞాన శాస్త్ర ప్రభావం ఆధునిక తత్త్వశాస్త్రం మీద ముఖ్యంగా మనస్సు - శరీరం, దేశ కాలాల మీద గాఢంగానే వుంది. విట్ గెన్‌స్టీయిన్ అంటాడు. Philosophy is not a cognitive pursuit, there are no new facts to be discussed by philosophy; only new insights. తత్వశాస్త్రం శాశ్వతమైన ప్రశ్నలను పరిశీలన, పునః పరిశీలన చేస్తుంది. ప్రగతి స్వల్పమైన విషయం. గతంలోని కొన్ని ముఖ్యవిషయాలు నూతనాభి వృద్ధిలో మరుగున పడిపోతాయి. నియోప్లేటొనిజం, నియోకాంటినిజం వంటి వాదాలు తాత్విక భాషలో పెనుమార్పు కనిపిస్తుంది. ప్రధానంగా కనిపించిన తాత్విక ఉద్యమాలు మూడు: 1. విశ్లేషణాత్మక దర్శనం. 2. తార్కిక అనుభవ వాద దర్శనం. 3. దృగ్విషయ దర్శనం.

**విశ్లేషణాత్మక దర్శనం:** ఆంగ్లభాష మాట్లాడే ప్రపంచంలో విశ్లేషణాత్మక దర్శనానిదే పైచేయి. తార్కిక భాషా విశ్లేషణ నుంచి ఈ పేరు వచ్చింది. మూర్ (1873-1958) తత్వశాస్త్ర పరిభాష స్థానంలో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టడమే కాకుండా తాత్విక జ్ఞానంగా భావించబడేదాన్ని ధ్వంసం చేసి అజ్ఞానం మనకు వ్యావహారిక జ్ఞానంగా సులభ లభ్యమేనని వాదించినవాడు.

తత్వశాస్త్రాన్ని సాధారణీకరించి తర్కశాస్త్రాన్ని సముద్ధరించి, శాస్త్రీయ విధానానికి సన్నిహితం చేసినవాడు రసెల్ (1872-1970) శబ్దాల మహారణ్యంలో చిక్కుకుని బయట యేదారి తెలియని దర్శనానికి శబ్దం నుండి బయట పడటానికి దారిచూపాడు. విట్‌గెన్‌స్టీయన్ (1889-1951). విశ్లేషణాత్మక దర్శనాభివృద్ధికి నిరుపమాన కృషిచేసాడు. ఈ ఉద్యమాన్ని కేంబ్రిడ్జి తాత్వికులే గాక, ఆక్స్‌ఫర్డు తాత్వికులు, యూరప్, అమెరికా తాత్వికులు కూడా కృషి చేశారు. భాషలో గొప్ప మలుపు తీసుకువచ్చారు. విశ్లేషణాత్మక వేదాంతం. బ్రహ్మస్థాయికి తీసుకువచ్చారు. Analytical metaphysics reduced to Brahman. భాషలో వచ్చిన మార్పునే 'లింగ్విస్టిక్‌టర్న్' అన్నారు. 1945 తరవాత బాగావ్యాప్తి చెందింది. అమెరికా తాత్వికులు విశ్లేషణాత్మక శైలిని అనుసరించారు. సైన్సును గౌరవిస్తూనే విశ్లేషణాత్మకంగా వ్రాయగలిగారు. సమకాలీన దార్శనికులు విశ్లేషణాత్మక దర్శనం చరమదశకు చేరుకున్నట్లు ప్రకటించారు. 1970 నుండి విశ్లేషణాత్మక దర్శన శాస్త్ర స్థానాన్ని మానసిక తత్వశాస్త్రం ఆక్రమించింది. వాక్య నిర్మాణాన్ని భాషను విశ్లేషించి వాక్యాల అర్థాలను వాటి తార్కిక స్వభావాన్ని అర్థం చేసుకోవడమే విశ్లేషణాత్మక దర్శనానికి మూలం. ఇదే తార్కికప్రత్యక్ష జ్ఞానవాదంగా అవతరించింది.

**తార్కిక ప్రత్యక్ష జ్ఞానవాదం - తార్కిక అనుభవవాదం:** 1930 నుండి తార్కిక ప్రత్యక్ష జ్ఞాన వాదులు విశ్లేషణాత్మక పద్ధతిని అభివృద్ధి పరచారు. వేదాంతానికి వ్యతిరేకంగా వైజ్ఞానిక దృష్టితో తార్కికంగా భాషావిశ్లేషణాత్మకంగా వివరిస్తారు. ఈ పద్ధతిని అనుసరించేవారు. వేదాంతం, మతం, నీతి, వాక్యాలు అర్థం రహితాలని అవచనీయాలని పరిశీలనార్హాలు కావని, కొన్ని విషయాలు మినహాయించి, మిగతా విషయాల్లో భాషకు నిశ్శబ్దమే శరణ్యమనీ చెపుతారు.

---

శివలింగం, చల్లపల్లికి చెందిన ప్రసిద్ధ చింతనా శీలి.

1928-34లో యూరప్‌లో ఈ ఉద్యమం శిఖరస్థాయికి చేరింది. తరవాత చాలామంది అమెరికా తరలివెళ్ళారు. అక్కడ తార్కిక అనుభవవాదం. జనాదరణ పొందేవుంది. 1960 నాటికి తార్కిక అనుభవవాదం కనుమరుగయింది. అన్ని వేపుల నుండి దాడికి గురికావడంతో కుప్ప కూలిపోయింది. Quine, Kuhn లాంటివారు సరియైన మార్గంలో వుండటం వలన బతికిపోయారు.

**దృగ్విషయ దర్శనం:** రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఈ తాత్విక ధోరణినే కాంటినెంటల్ ఫిలాసఫి అని పిలిచారు. యూరప్, అమెరికా జర్మనీ దేశాల్లోని విభిన్న తాత్వికుల దర్శనానికి పెట్టినపేరు, ప్రధమంగా దృగ్విషయ దర్శనమని పేరుపెట్టినవాడు హజరల్, (1859-1938) దృగ్విషయ ప్రపంచాన్ని యధాతధంగా గ్రహించటమే సక్రమమైన మార్గమని భావించి దానికి సాధనంగా దృగ్విషయ శాస్త్రాన్ని అభివృద్ధి చేశాడు. బాహ్య ప్రపంచంతో సంబంధంలేదు. మానవ చైతన్య ప్రపంచంతోనే సంబంధం. హార్డుమనీ, హిడెగ్గర్ (1889-1976), మర్లొపొంటి (1908-1961), సార్త్రేలు కృషిచేశారు. దృగ్విషయ శాస్త్రాన్ని నిర్వచించడం కష్టం. క్లుప్తంగా చెప్పాలంటే ఏవిధమైన రాగద్వేషాలు లేకుండా మానవ అనుభవాన్ని స్వేచ్ఛగా స్పష్టంగా వర్ణించడం, చైతన్యాన్ని విశ్లేషించడం, వర్ణించడం.

దృగ్విషయ శాస్త్రం విశాలమైన క్షేత్రం. మానవుని స్థితి మీద ఒక ప్రణాళికా బద్ధమైనవిమర్శ. మానవ జీవితం మీద ఒక నూతన దృక్కోణం. (విశ్లేషణాత్మక దర్శనంలో నూతనత్వంగాని, అనుభవ దర్శనగాని లేదు). మానవులు అనుభవించిన జీవించిన ప్రపంచాన్నే పరిగణలోకి తీసుకుంటుంది.

జీవన జగత్తు, విశ్వాసాలు, అనుభూతులు, విలువలు, సాంస్కృతిక ఆచరణలే దైనందిన జీవితాన్ని నిర్మిస్తాయి. ఈదర్శనమంటే గిట్టనివారు నాటకీయమని, మెలోడ్రమటిక్ పలుకులేగాని హేతువాద చర్చలేదని వాపోయారు. సరియైన దర్శనకారులు కాంటినెంటల్ ఫిలాసఫీని వదులుకోవాలన్నారు.

విజ్ఞాన శాస్త్రానికి, తత్వశాస్త్రానికి మధ్య సరిహద్దురేఖ చెరిగిపోతుంది. జ్ఞానం, సత్యం, ఆత్మ, దేవుడు, కర్మ, విలువలు, మనస్సు, కాలం, సారం, తాదాత్మ్యత, సచ్ఛీలత వంటి విషయాలను ఇంకా చర్చిస్తూనే వున్నారు. విషయ జ్ఞానాన్ని వివరిస్తుంది విజ్ఞానశాస్త్రం. తత్వశాస్త్రం విజ్ఞాన శాస్త్రం లాగ పురోగమించదు. జీవిత మార్గదర్శిగా వుండాలి దర్శనం. ఆలోచనలో తార్కిక వివరణ, హేతుబద్ధమైన విమర్శనాత్మక ఆలోచన, ప్రపంచ సామాన్య స్వభావం, దృగ్విషయ దార్శనికులు మానవ జీవితాన్ని, జీవ ప్రపంచంలోని విషయాలను విచారిస్తుంది. భారతీయ వేదాంతులు, బౌద్ధ దార్శనికులు జీవితాన్ని పరిపూర్ణం చేసుకోడానికి మార్గదర్శిగా తత్వవివేచన చేయగల సమర్థులు. శుష్కపాండిత్య చర్చలుగా మిగిలిపోకుండా పరిపూర్ణపు బ్రతుకును చూపేదిగా వుండాలి దర్శనం.

*( 365వ పేజి తరువాయి)*

ఆస్థానకవి పదవి, శాసనమండలి సభ్యత్వం, సాహిత్య అకాడమీ సభ్యత్వ పదవులు, సత్కారాలు వగయిరా పొందినంతమాత్రాన - అయినదానికీ, కానిదానికీ ప్రభుత్వాన్ని ప్రస్తుతించేటంతటి స్వాభిమానహీనులా మన సారస్వతులు? కవులు? మన వారిని మనమే అట్లా న్యూనపరిచి ఈసడించడం ఎంత హీనం?

ఎవరైనాసరే, ఏ విషయంలోనైనా సరే తాము తలిచే తీరునే తతిమ్మావాళ్ళంతా తలవాలని తలపోయటం తగదు. ఎవరి భావాలను వారు, ఇష్టానుసారం వెల్లడించే, వ్యక్తంచేసే స్వాతంత్ర్యం ప్రతివారికీ ఉండాలి. ఎక్కువమందికి ఏ హానీ కలిగించని భావజాలాన్ని, నచ్చకపోతే, నిర్లక్ష్యం చేయటం తగుపని. బహుజనులకు హాని కలిగించే భావజాల వ్యాప్తిని మాత్రమే చేతనైతే విమర్శించి, ఖండించి, అడ్డుకోవాలి. ఆచార్య సుప్రసన్నవంటి పరిపక్వమానసులు, మనీషుల కర్తవ్యం ఇదే అనుకుంటాను.

# జాషువా ఆత్మావిష్కారం - నా కథ

- డా॥ అద్దంకి శ్రీనివాస్

ఆంగ్లసాహిత్య ప్రభావం తెచ్చిన చిత్ర విచిత్ర పరిణామాల్లో ఆధునిక సాహిత్యంలో చోటుచేసుకొని సాహిత్య చరిత్రాధ్యయనానికి ఒక కొత్త ఒరవడిని తీసుకొచ్చిన రచనా ప్రక్రియలు జీవిత చరిత్ర, స్వీయ చరిత్రలు.

ప్రాచీన సాహిత్య కవుల దృష్టి ప్రత్యేకంగా వీటిని తాకలేదు. అవతారికలే కొద్దో గొప్పో కవికి సంబంధించిన అంతరంగాన్ని ఆవిష్కరించేందుకు వేదికలయ్యాయి. కొందరు కవులైతే ఆ అవతారికలకు కూడా పెద్దగా ప్రాముఖ్య మివ్వలేదు. కావ్య అవతారికలు రాసినా అవి కాలగర్భంలో నశించి పోయి ఉండవచ్చు. ప్రక్షిప్తాల ద్వారా మార్పులూ చేర్పులూ జరిగిన అవతారికల ద్వారా కవి అంతరంగం ఆవిష్కరింపబడడం అటుంచి కొన్ని ప్రమాదాలు కలగడానికి కూడా అవకాశం లేకపోలేదు. అందువల్ల ప్రాచీన కవుల కావ్యావతారికల మీదే పూర్తిగా ఆధారపడి సాహిత్యాధ్యయనం చేయడం కుదరదు. కానీ ఆధునిక కాలంలో సాహిత్య స్థితి గతుల్ని చక్కగా అధ్యయనం చేయడానికి, ప్రత్యేకంగా ఒక కవి యొక్క అంతరంగం, సాహిత్య వ్యక్తిత్వం వంటివి సహేతుకంగా తెలుసుకోవడానికి ఎక్కువగా సహకరించేవి చరిత్ర రచనలే. జీవిత చరిత్ర ఒకరు ఇంకొకరి గురించి రాస్తారు కాబట్టి దానిని నమ్మవచ్చు. కానీ స్వీయ చరిత్ర రాసేది కవే కాబట్టి ఆత్మోత్కర్ష కోసం ఉన్నవీ లేనివీ సృష్టించి రాసిన వాటిని ఎలా నమ్మడం అనే సందేహం కూడా రాకమానదు. ఈ అనుమానాన్ని Dr. Johnson ఈ విధంగా నివృత్తి చేస్తున్నారు.

"He that speak of himself has no motive to falsehood or partiality."

తన గురించి తాను చెప్పుకొనే వాడికెన్నటికీ అబద్ధమాడాలనే ఆలోచనగానీ, పక్షపాత వైఖరిగానీ లేక నిష్పక్షపాతంగా విషయ విమర్శనం గావిస్తాడు. జీవితాన్ని నైతిక మార్గంలో దర్శించగల దార్శనికుడు మాత్రమే స్వీయచరిత్రను నిర్మించడానికి సిద్ధపడతాడు. అంతేకాదు లలిత కళలలో ఉత్తమమైన కవిత్వ కళ కలవారికి కావలసినది కేవలం సృజన శక్తి మాత్రమే కాదు. ఆత్మ పరిశీలనా దృష్టి కూడా ఎంతో అవసరం.

భారతీయాలంకార శాస్త్రంలో ఆఖ్యానమనీ, ఉపాఖ్యానమనే కావ్య భేదాలలో చరిత్ర రచనను పేర్కొనడం మాత్రమే జరిగింది. గానీ వాటికి సంబంధించిన ఉదాహృత గ్రంథాలేవీ కానరావు. అదే సంప్రదాయంలో ప్రాచీన కవులు కూడా తెలుగులో చరిత్ర రచనను ప్రత్యేకంగా చేయడం వల్ల సామాజిక, రాజకీయ, సామిత్యాది విషయాలకు సంబంధించిన ఎన్నో అంశాలు కొత్తగా వెలుగులోనికి వచ్చే అవకాశం ఉంటుందని వారు గ్రహించకపోవడం దురదృష్టకరం. ఈ లోటును ఆధునిక సాహిత్యం ఎంతగానో పూరించింది. వీరేశలింగం, చిలకమర్తి వారలు రచించిన స్వీయ చరిత్రలు, కాళేశ్వరరావుగారి 'నా జీవిత కథ - నవ్యాంధ్రము' అనే స్వీయ చరిత్ర, టంగుటూరి వీరేశలింగం గారి నా జీవిత యాత్ర, తిరుపతి వేంకటకవుల 'జాతకచర్య,' తుమ్మలవారి గాంధీ ఆత్మకథ వంటివి ఆంధ్ర సాహిత్యంలో వెలువడిన చరిత్ర రచనలలో ముఖ్యమైనవి. గద్య పద్యోభయంగా చరిత్ర రచన సాగించడమూ దీనిలోని ప్రత్యేకత. ఇదే కోవకు చెందిన మరొక స్వీయ చరిత్ర గుఱ్ఱం జాషువా రచించిన 'నా కథ.'

డా॥ అద్దంకి శ్రీనివాస్, తెలుగు శాఖ, ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్టణం

స్వీయ చరిత్ర దేశకాల స్థితిగతులను నమోదు చేసే అద్భుత గ్రంథం. దానిని రచించిన వ్యక్తి దృష్టిలోంచి సమాజాన్ని, సాహిత్యాన్ని, ప్రపంచాన్ని చూపించే కమనీయమైన కావ్యం. జాషువా కవి వ్యక్తిత్వం, ఆలోచనాధోరణి, ఎదుర్కొన్న ఆటుపోట్లు, ఆనాటి సామాజిక వ్యవస్థ, కుల వ్యవస్థ, దేశ రాజకీయాలు, సమరోత్సాహం ఇలా ఒకటేమిటి ఎన్నింటినో తన అనుభవాల లేఖినితో గ్రంథస్థం చేశారు. ఆత్మకథ రాయాలంటే చరిత్ర కెక్కిన మహాపురుషులే కానక్కర్లేదు. ఆత్మశాంతి కోసం కూడా రాసుకోవచ్చు. కల్లోల కెరటాలతో అశాంతిమయ జీవితాన్ని గడపడానికి గతాన్ని చక్కగా నెమరువేసుకోవడం కన్నా సంతోషం ఇంకేమీ ఉండదు. ప్రతి ఆత్మకథా గొప్పది కాదు. ఆత్మకథ రాసిన వారంతా గొప్ప వాళ్ళే కావాలనే నిబంధనలేదు. అందరూ మెచ్చే గుణాలు ఆత్మకథలు రాసిన గొప్ప వాళ్ళలో కూడా లేకపోవచ్చు. కానీ తప్పును నిర్భయంగా చెప్పడం, తప్పొప్పులను సింహావలోకనం చేస్తూ ముందు తరాలకు స్ఫూర్తి దాయకంగా ఉండేలా రచన చేయడమే ఆత్మకథ రాయడానికి మొదటి అర్హత.

"నా సాగించిన కవితా ప్రవాసంలో కొన్ని తీగెలు తెగినయి, ముడులుపడ్డయి, బెట్లు తప్పినయి, మూగవోయినయి, కాని నిరుత్సాహిని మట్టుకు కాలేదు" అంటూ చదివే వారిని మరింత కృంగదీసే ఉద్దేశం లేదని, పడినా లేవడం ఎలాగో నేర్పేందుకే నా ఈ రచన అనే అంతరంగం ఆవిష్కృత మౌతుంది జాషువా 'నా కథ'లో.

చిన్న తనం నుండి అపురూపంగా అల్లుకొచ్చిన సాహిత్యపు పొదరిల్లు, ఆ పొదరింట్లో జాషువా ఏ విధంగా నడయాడినదీ, కవిగా గుర్తింపబడడానికి పడ్డ అగచాట్లు, ఆదరణ గానీ, ఊతమిచ్చే వారుగానీ లేక పడిన పాట్లు వీటన్నింటినీ ఆంధ్ర లోకానికి తెలియజేయాలని, ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ, కవిత్వాన్నే నమ్ముకొని జీవించిన వైనం ఇవన్నీ హృద్యమైన పద్యాలలో పొందుపరచిన ప్రతిభాశీలి జాషువా. 'నా కథ'ను నాలుగు భాగాలలో రాయాలనుకొన్నారు గానీ మూడు భాగాలే రచించారు.

స్వీయ చరిత్ర రచించాలంటే దానికి ఎంతో ధైర్యం కావాలి. గౌరవానికి భంగం కలగకూడదని తప్పుల తడకలా లోపాల్ని దాచిపెట్టి చేసే రచన చరిత్ర రచనా సిద్ధాంతానికి విరుద్ధమని 'నాకథ' ప్రారంభంలోనే చెప్పారు జాషువా.

నా కథ మొదటి భాగం జాషువా ప్రాణ స్నేహితుడైన మాధవరెడ్డి రాజయ్య అంకితం పుచ్చుకొన్నారు. రెండవ భాగాన్ని ప్రత్తిపాటి ఆదినారాయణ, మూడవ భాగాన్ని బొడ్డు ప్రకాశం అంకితం పుచ్చుకొన్నారు.

బాల్యం వ్యక్తి జీవితానికి పునాది. చిన్ననాటి చేష్టలు, కొంటెపనులు, తిరిగిన ప్రదేశాలు ఇవన్నీ 'నా కథ'లో చోటుచేసుకొన్నాయి. పుట్టి పెరిగిన 'వినుకొండ' వారి ఆత్మావిష్కరణతో మరింత వాసి కెక్కింది.

ఏ మాత్రం వెనకాడకుండ చిన్ననాటి చిల్లర అల్లరి పనులను జాషువా ఈ విధంగా పేర్కొన్నారు.

"అనువారంబునకు చేలలో బెసరగాయల్ దొంగిలింపగ జ
ట్టును గూపెట్టి చరించు నన్నలిగుతిట్టుల్ దీవెనల్ బెట్టున
ల్లని బూబమ్మ సజీవమే యిపుడు? లీలా స్వప్న రేఖాకృతిన్
గనుపట్టున్ ముసలమ్మ రూపమిద జీర్ణంబైన వస్త్రాలతో"

అంతేకాదు -

చదువులో వెనుకంజ వేసిన వీరి వీపుకై అయ్యవారి బెత్తం శిక్షా తాండవమే చేసేదట! చిన్న తనంలో తెలియక చేసిన దొంగతనాన్ని గురించి జాషువా ఏ మాత్రం దాచకుండా చెప్పారు. దొంగతనం వల్ల పెరిగే అవినీతి తత్వాన్ని తల్లి బోధనల ద్వారా తెలుసుకొని మున్ముందు చక్కదిద్దుకొన్నారు. అల్లరి పనులు చేసినప్పుడు గురువుగారికి కోపం వచ్చినప్పుడు తనకున్న అంటరాని తనం వల్ల దెబ్బలు తప్పేవని, సమాజంలో ఆనాడు కల కుల వివక్షతని

"మా గురువుగారికి కోపము వచ్చు వేళ వెంపలరెడు నంటరాని

తన మద్దము వచ్చె న దొక్కమేలుగా" ఎంతో సునిశితంగా విమర్శించారు. ఈ సునిశిత విమర్శనమే తరువాత కొంత కర్కశంగా మారి ఎందుకిలా జరుగుతోందనే ప్రశ్న సమాజంపై సంధించారు జాషువా.

"నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి రూపరే
ఖాకమనీయ వైఖరులు గాంచి భళీ! భళి! యన్నవాడే మీ
దేకులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున గ్రుమ్మినట్లగుమ పార్థివచంద్ర! వచింప సిగ్గగున్"

చిన్ననాటి గురువు చూపిన అస్పృశ్యత విద్యాలోకాన్ని, వెంకటగిరి రాజాస్థానానికి వెళ్ళే సందర్భంలో ఒక బ్రాహ్మణ పండుతుడు అడిగిన ఈ ప్రశ్న కవి లోకాన్ని కలుషితం చేసినందనే ఆవేదనను వ్యక్తం చేసారు. విద్యలు, కళలు కులమతాలకు అతీతంగా ప్రతిభా మూలకంగా వెలుగొందాలనే స్పష్టమైన ఆలోచన జాషువా కవిత్వంలో కన్పిస్తోంది. వినుకొండలో జరిగిన ఒక సభలో కవిత్వం చదవాలని వెళ్ళిన జాషువాకి తీవ్రమైన అవమాన భారం ఎదురయ్యింది.

"సభలోనికెట్టు జొరబడె
నభాగ్యుడీ నిమ్నజుండటంచుందమలో
గుభగుభలాడి తటాలున
సభికులు పదిమంది లేచి చనిరుద్ధరులై"

వీరి ఆశయాలకు తగిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సహవాసయోగం జాషువా అనుభవించిన అస్పృశ్యతా జ్వాలల్ని కొంత ఉపశమింపజేసింది. కవితా కళ మతాతీతంగా ఉండాలనడానికి జాషువా - పిచ్చయ్యశాస్త్రుల అన్యోన్యమైత్రియే నిదర్శనం. వీరిద్దరూ జంట కవిత్వం చెప్పాలనుకొన్నారు. జంటకవులుగా వీరి పేర్లు ఎలా ఉంటాయో జాషువానే ఇలా చెప్పారు.

"నా పేరు ముందు నిల్పం
బాపంబదియేమొ జాషువా పిచ్చులగున్
నా పేరు చివర నిల్పిన
శాపంబడినట్లు పిచ్చ జాష్వా లయ్యేన్"

జంటకవులుగా వీరి పేర్లు సరిపోవక పోవడంతో నిరాశ చెందారు జాషువా. అలాగాక దీపాల వారితో జాషువా జంట కవిత్వం చెప్తే, ఆ జంట కులమత జాడ్యాల్ని శాశ్వతంగా తుడిచేసేందుకు మహోపకారిగా నిలిచి ఉండేది.

సాహిత్యాన్ని కష్టపడి చదవడం, పద్యాలల్లడం, ఆశు కవితా ప్రయత్నం వంటి ఎన్నో సాధనా పరమైన విషయాల్ని నా కథలో పొందుపరిచారు.

"నా తోటి బాలురందరు పృచ్ఛకులు గాగ
తలతోకలేని పద్యములు చెప్పి
కుతిదీర కనుపట్టు ప్రతిపదార్థము మీద
కృతులల్ల కలము గాగితము దడవి"

అంటూ ఈ విధమైన అపరిపక్వ స్థితినుండి నిరంతర ప్రయత్న ప్రకర్షతో "వీడా వీరయ్య కుమారకుండు *గద భేషంచున్*" ప్రజలు తలలూపి ఆమోదముద్ర వేసే స్థాయికి ఎదగడానికి ఎంతగా కష్టపడ్డారో, ఆ కష్టాన్ని నిలబెట్టుకోవడానికి ఎన్ని అగచాట్లు పడ్డారో అందరికీ అందించి ఆనాటి సామాజిక స్థితిగతుల్ని పేర్కొన్నారు.

కులం తనను అడుగడునా అవమానించిందనీ, మతం బ్రతుకుతెరువుని పోగొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

"అందరము పుట్టు పాపులమని యహేతు
కముగ భయ బీజములు నాటి కలత పెట్టి
బ్రతుకు, మత బోధకుల యనుగ్రహము తప్పి
సంఘ బాహ్యుడనైతి క్రైస్తవుల యందు"

సంఘం ఒకవైపు అస్పృశ్యుడని వెలివేస్తుంటే, మరోవైపు క్రైస్తవ మత గ్రంథాలను చదవకుండా, హిందూ గ్రంథాలనే చదువుతున్నాడని 'చాట్రగడ్డపాడు'లో చేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగాన్ని ఊడబీకించారు. క్రైస్తవ మతబోధకులు. కులమతాలు ఏర్పరచిన జీవన సుడిగుండంలో చిక్కి....

"ఊడెం బడిపంతులుపని
యూడెన్ మర్యాద, యూడెనుత్సాహములో
నూడని సంసారము వెం
టాడగ దిరిగితిని పల్లియలు పట్టణముల్"

సంసారాన్ని భుజానవేసుకొని ఊరూరా తిరగవలసిన దుస్థితి దాపురించింది ఆయన జీవితంలో- తరువాత కోటిలింగాలవద్ద ఉపాధ్యాయునిగా ఉద్యోగం, సైనికుడై దేశ సేవ చేయాలనే వారి ఆశయం. అన్నీ ఎగిరి పోయి చివరికి చింతామణి నాటకమండలికి నాటకరచయితగా మారారు.

ఇతరులలోని దుర్గుణాలను ఎండగట్టడమే కాదు. సుగుణాలను సైతం స్వీయచరిత్రలో భద్రంచేశారు జాషువా. మొట్టమొదటిసారిగా వీరేశలింగం గారిని దర్శించినపుడు -

క్రైస్తవుండ కవిని కడుపేదవాడనా
లంబనంబు నాదరంబులేని
ఆదిమాంధ్రకులుడనని నమస్కృతి జేసి విన్నవించుకోగా,

అంతకుముందే జాషువా చదివి వినిపించిన రుక్మిణీ పరిణయ నాటకాన్ని విన్న కందకూరివారు 'సెహభాష్' అని మెచ్చుకొని ప్రోత్సహించారట! అలాగే చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారిని సందర్శించినపుడు -

"ఆదిమాంధ్రుడ, కవనంబు నల్లగలను
పేరు జాషువ, రఘురామ వీరవరుడు
పృథివి జాతాపహరణంబు విన్నచోటు
శ్రుతగిరిపురంబు నాది నృసింహకవి" అని పరిచయంచేసుకోగా చిలకమర్తివారు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న అనుభూతి ఆపాతమధురమని పేర్కొన్నారు జాషువా. తనకు తదనంతరకాలంలో జరిగిన సన్మానాలనే కాక, తుమ్మల కవి వంటివారు తన రచనల్ని తప్పుపట్టిన సందర్భాల్ని కూడా పేర్కొని నిష్పాక్షికంగా ప్రవర్తించారు.

స్వాతంత్రోద్యమకాలంలో ఆంగ్లప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు చేసిన బలిజేపల్లి లక్ష్మీకాంతం జైలుపాలుకాగా, దానిని చూసి నా రచనలను కూడా భయపడి ప్రజలముందు చదవకుండా, జేబులో దాచివేశానని నిజాయతీగా చేసిన తప్పును చెప్పుకున్నారు.

విజయవాడలోని వేంకటశాస్త్రిగారే స్వయంగా గండపెండేరం తొడగడం, తిరుపతిలోని మహాపండితులు తనకు 'మధుర శ్రీనాథ' బిరుదునిచ్చి గౌరవించడం చిరస్మరణీయమైన అనుభూతులని చెప్పుకొన్నారు. కుటుంబ బాధలు, భార్యావియోగంవంటివి తన ఆశయాలకూ లక్ష్యాలకూ ఎప్పుడూ అవరోధంకాలేదని అందరికీ ఆదర్శప్రాయులై నిలిచారు.

"చక్రారపంక్తిరివ గచ్ఛతి భాగ్య పంక్తిః" సంపదలు శాశ్వతంకావు. కీర్తి శాశ్వతం. అందుకే జాషువా సంపదలకోసం పాకులాడలేదు. కటిక దారిద్ర్యంలోంచి కీర్తిపతాకను కష్టపడి ఎగురవేశారు. కష్టసుఖాలు రెండింటికీ ఆయన లొంగలేదు. సమస్యలు ముళ్ళై బాధిస్తున్నా లక్ష్యగమనం మానలేదు. తన కవితాయుధాన్ని సంఘంపై ఝుళిపిస్తూనే ఉన్నారు. ఆగర్భ దారిద్ర్యం, కులవివక్ష అడుగడుగునా ఆయన్ని అవమానిస్తూ, కృంగదీస్తూ వస్తున్నప్పటికీ, వాటి నుంచే అనుభవపాఠాల్ని నేర్చుకొని, జాగ్రత్తగా తన జీవితాన్ని తాను అనుకొన్న దిశలో మలుచుకుంటూ, తరువాత తరాలవారికి ఆదర్శంగా నిలిచారు.

తాను అనుభవించిన జీవన సంఘర్షణ పలు రచనలలో ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే జాషువా ప్రతి రచనా ఆత్మావిష్కారమే. ఆవేదాల కాసారమే. అయినా పూర్తిగా తన జీవితానుభవాన్ని, నాటి సామాజిక స్థితిని శాశ్వతంగా నమోదుచేయడానికే 'నాకథ' రచించారు.

చరిత్ర రచన ద్వారా దేశాభ్యుదయం కలుగుతుంది. ఆవేదనల పాదుల్నించి పెరిగిన ఆలోచనా ధోరణి వ్యక్తి జీవితం నుండి దేశ జీవితాన్ని ఆవిష్కరిస్తూ, అందరూ ఆచరించదగిన చక్కని మార్గాన్ని అన్వేషిస్తాయి. వ్యక్తి సమూహమే సంఘం. కొన్ని సంఘాలు కలిస్తే దేశం. అలాగే వ్యక్తి జీవిత చరిత్రే దేశ చరిత్ర. పక్షపాతరహితంగా చేసే రచనలు తదుపరి కాలాలవారికి ఎంతగానో ఉపయోగపడతాయి. జీవిత చరిత్రలకన్నా స్వీయ చరిత్రలేమిన్న. ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తి చరిత్ర రాయాలంటే కావలసిన వనరులు లభ్యంకావు. అందువల్ల ఎవరి చరిత్రను వారే ఆవిష్కరిస్తే ఏ లోటుపాట్లూ ఉండవు. వ్యక్తి సంస్కరణ, తద్వారా సంఘ సంస్కరణ సాధ్యమయ్యేందుకు చరిత్ర రచనలు ఎంతగానో దోహదం చేస్తాయనడంలో ఎంతమాత్రమూ సందేహం లేదు.

# సాహిత్య విమర్శకుడుగా జి.వి. కృష్ణరావు

డా॥ యు.ఎ. నరసింహమూర్తి

యా వ్యాపారవతీ రసాన్ రసయితుం కా చిత్క వీనాం నవా
దృష్టిర్యా పరినిష్ఠితార్థ విషయోన్మేషా చ వైపశ్చితీ,
తేద్వే అప్యవలమ్బ్య విశ్వమనిశం నిర్వర్ణయన్తో వయం
శ్రాన్తా నైవ చ లబ్ధ మబ్ధి శయన త్వద్భక్తి తుల్యం సుఖామ్.

(ధ్వన్యా - తృ. ఉ - శ్లో 122)

పై శ్లోకంలో కవి, విపశ్చితుడు అనే రెండు పదాలు ఉన్నాయి. "కౌతి శబ్దాయతే విమృశతి రసభావాన్ ఇతి కవిః" అనే వాక్యం కవి కూడా ఒక విధంగా విమర్శకుడే అన్న భావాన్ని ప్రకటిస్తుంది. "విశేషేణ పశ్యన్ చేతతీతి విపశ్చిత్" అనే వాక్యం విపశ్చితుణ్ణి కూడా విమర్శకుడుగా నిలుపుతుంది. అయినా కవికి, విపశ్చితుడికి భేదం కనిపిస్తుంది. కవిది మిధ్యాదృష్టి, విపశ్చితునిది తథ్యదృష్టి. ప్రతిభావంతుడు నూత్న సృష్టిచేసే సందర్భంలో ఈ దృష్టి ద్వయ వ్యసనం సంక్రమిస్తుంది. ఆ కారణంగా అమితమైన శ్రాంతి కలుగుతుంది- అని ఆనందవర్ధనుడు పై శ్లోకంలో పేర్కొన్నాడు. ఆనందవర్ధనుడు జి.వి. కృష్ణరావుకు కూడా ఆనందవర్ధనుడే. ధ్వన్యాలోకం ఆయన అభిమాన గ్రంథం. అందుకే విమర్శకుడుగా జి.వి. కృష్ణరావు ఒక జీవితకాలపు శ్రాంతికి లోనయ్యారు. విష్ణుభక్తి తుల్యమైన విమర్శపథ చరమలక్ష్యాన్ని చేరుకోవడం ఆయనకు కూడా సాధ్యం కాలేదనిపిస్తుంది. ఎప్పుడు చూసినా వేడి కాఫీ ఆవిరులలోను, సిగరెట్టు పొగలలోను మునిగిపోయి కృష్ణరావు కనిపించేవాడు[1] అన్న సంజీవదేవ్‌గారి మాటలు గుర్తుకు రాగానే విమర్శ ప్రస్థానంలో నిరంతర శ్రాంతుడైన జి.వి.కృష్ణరావులోని వేసటలేని ఆలోచనా వలయాలు మన కళ్ళముందు నిలుస్తాయి. ఈ నిరంతర శ్రాంతి కారణంగానే 1930-80 మధ్యకాలంలో తమ సృజనాత్మక వ్యాపారంతోను, తాత్త్విక చింతనతోను, విమర్శ వైదగ్ధ్యంతోను తెలుగు సారస్వతాన్ని నూత్న మార్గంలో పరిపుష్టం చేసిన, వేళ్ళమీద లెక్కించదగిన కొద్దిమంది మేధావులలో ఒకరుగా జి.వి.కృష్ణరావు ప్రఖ్యాతులయ్యారు.

ప్రతిభ కల విమర్శకులలో మూడు వర్గాల వారుంటారు. కొందరకు ప్రాథమిక దశలోనే తమ దర్శనం స్థిర సత్యంగా భాసిస్తుంది. వారు దానిని విశ్వసించి ఆ స్థిర సత్య స్థాపన కోసం జీవితమంతా పరిశ్రమిస్తారు. ఇంకొక వర్గంవారు వికాస శీలం కలవారు. వీరి విమర్శ ప్రస్థానంలో కొన్ని వికాసదశలు ఉంటాయి. ప్రతి దశలోనూ ఏదో ఒక అసంతృప్తి వీరిని వెన్నాడుతూ ఉంటుంది. అయినా తాము ప్రాథమిక దశలో పొందిన జ్ఞానభూమిక నుండే వివిధ వికాస దశలను అధిగమించి తమ లక్ష్యసాధన కభిముఖమైన సత్యస్థాపన కోసం వీరు ప్రయత్నిస్తారు. ఇంకొక వర్గానికి చెందిన విమర్శకుల విమర్శ ప్రస్థానంలో ఎన్నో మజిలీలుంటాయి. ప్రతిభ కలిగి ఉండి కూడా వీరు ప్రతి దశలోను ఎవరో ఒకరి ప్రభావానికి లోబడుతూ ఉంటారు. ప్రతి దశలోను వీరికి ఆరాధ్యులైన పథప్రవర్తకులుంటారు. వారినెంత ప్రగాఢంగా విశ్వసించినా ఇంకొక మజిలీలో వారిమీదగల విశ్వాసం సడలుతుంది. ఇంకొక వర్గం మీద దృఢతరమైన విశ్వాసం ఏర్పడుతుంది. ప్రతి మజిలీలోనూ తమ విశ్వాసాన్ని స్థిరసత్యంగా విశ్వసిస్తూ

---

డా॥ యు.ఎ. నరసింహమూర్తి మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా
పదవీ విరమణ చేశారు, విజయనగరం.

దాని స్థాపన కోసం అవిశ్రాంత మథనం కొనసాగిస్తారు. అన్ని మజిలీలలోను ఇతరేతర శక్తుల ప్రభావానికి లోనౌతూ తమదైన ఒక నూత్న దర్శనం కోసం తపన పడతారు. వీరిని ఆనంద వర్ధనుడు "శ్రాన్తులు" అన్నాడు. వీరు సహజంగా ప్రతిభావంతులైన కారణంగా నిరంతరాన్వేషణతో కూడిన వీరి విమర్శప్రస్థానం లోని ప్రతి మజలీ సారస్వతేయులకు స్వాదువుగాను, ఆస్వదనీయంగాను కనిపిస్తుంది. సహృదయులు వీరిని విపశ్చిద్వరేణ్యులుగా గుర్తిస్తారు. 1930-80 మధ్యకాలంలో తెలుగునాట విమర్శక ప్రముఖులలో గణనీయమైన గుర్తింపును పొందిన జి.వి. కృష్ణరావు ఈ మూడవ వర్గానికి చెందిన ప్రజ్ఞాశాలిగా దర్శనమిస్తారు. "ఈతడెత్తు వారిచేతి బిడ్డగాని యొక తెన్నున బోవువాడు కాడు" అన్నట్లుగా కొందరికి కొన్ని సందర్భాలలో అనిపిస్తారు. తనకు తానే ఈవిధంగా చెప్పుకున్న సందర్భాలున్నాయి[2]. కానీ జి.వి. కృష్ణరావును తెలుగు విమర్శకులలో కేవలం ఎత్తువారి చేతి బిడ్డగా మాత్రమే జమకట్టకూడదు. సాహిత్య విద్యార్థులకు విమర్శకుడిగా ఆయన వ్యక్తిత్వం, విలక్షణ ప్రతిభా మూర్తిమత్వం ప్రతీ రచనలోను కనిపిస్తూనే ఉంటుంది. జీవితాన్ని, కుటుంబాన్ని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసి నిలుకడలేని తన జీవితంలో నిలుకడగల ఒక విమర్శ ప్రస్థానం కోసం తపన పొందిన నిరంతర పథికుడు జి.వి. కృష్ణరావు. సాహిత్య విమర్శకుడికి అవసరమైన నిర్భీక ప్రవృత్తి, నిష్కపట వైఖరి, నిరంతర అధ్యయనం, నిష్పక్షపాత దృష్టి, నిర్భర నిమగ్నత కృష్ణరావులో కనిపిస్తాయి.

1914లో తెనాలి తాలూకాలోని కూచిపూడి అనే కుగ్రామంలో సామాన్య రైతు కుటుంబానికి చెందిన, నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పుట్టిన గవిని వేంకట కృష్ణయ్య పాఠశాల దశను అధిగమించి గుంటూరులోని ఆంధ్రక్రైస్తవ కళాశాలలో చేరేటప్పటికి గవను వేంకట కృష్ణరావుగా మారాడు. ఈ మార్పు వెనుక బలమైన విమర్శ దృష్టి ఉంది. "గవిని" అనే మాటకు అర్థం లేదని పాఠశాలలో చదివే దశలోనే సవిమర్శంగా నిఘంటువును పరిశీలించి తెలుసుకొన్నాడా విద్యార్థి. ఇప్పుడు "గవను" దాటగలవారు మాత్రమే కృష్ణరావు విమర్శ దుర్గంలో ప్రవేశించగలరు. "గవను" అనే మాటకు దుర్గ ముఖంలోని బలిష్ఠమైన ఇరుకు మార్గమని అర్థం. అవధానాల అపరిపక్వస్థితి నుండి ఆనంద వర్ధనుని వ్యంజనసూత్రం వరకు వ్యాప్తిచెందిన కృష్ణరావు విమర్శలోని అంతర్లీన భావధారను ఆకళించుకోదలచిన వారు సువిశాల సాహితీ ప్రపంచంతో పాటు ప్రాచ్య పాశ్చాత్య తత్త్వశాస్త్ర మర్యాదలను కూడా సూక్ష్మేక్షికతో పరిశీలించవలసి ఉంటుంది. అటు భరతుడి నుండి ఇటు ప్లేటో నుండి నేటిదాకా నడచిన తత్త్వశాస్త్ర, అలంకారశాస్త్ర అధ్యయనం అవసరమౌతుంది. ఐతిహాసిక విలువలు అంతరించి పోవడమే సమకాలీన సమాజంలోని ధర్మచ్యుతికి కారణమనే ఆయన సాహిత్య ప్రబోధాన్ని గుర్తించడానికి, ఆయన వెల్లడించిన కళాతత్త్వ రహస్యాలను స్వాయత్తం చేసుకోవడానికి ప్రాచీన సాహిత్యాన్ని సవిమర్శంగా పఠించవలసి ఉంటుంది. ఆయన విమర్శలోను, సాహిత్యంలోను పోటెత్తిన తరంగ డిండీరాల కంటే భిన్నమైన అంతర్లీన సరిత్తు ఒకటి సహృదయులకు దర్శనమిస్తుంది. అదే ఆయన సరస్వతి.

పాఠశాల స్థాయిలో చిన్నయసూరి బాలవ్యాకరణం, ఛందస్సు, అలంకారాలు కృష్ణరావు విమర్శ సామగ్రి. తెలుగు ప్రశ్న పత్రానికి సమాధానాలు రాయకుండా అందులోని బాలవ్యాకరణ విరుద్ధ ప్రయోగాలను వివరంగా విమర్శించడం మాత్రమే సమాధానంగా చూపిన విద్యార్థి అతడు. ఉపాధ్యాయుణ్ణి విమర్శిస్తూ నల్లబల్ల మీద ఛందోబద్ధమైన ప్రౌఢ పద్యాన్ని రాసిన కారణంగా ఆయన

ఒక పాఠశాల నుండి ఇంకొక పాఠశాలకు బదిలీ కావలసి వచ్చింది. ఈ విధంగా పాఠశాల స్థాయిలోనే ఆయన చిన్నయసూరి ప్రభావానికి లోనయ్యారు. పరిణతి చెందిన తరవాత వాడుక భాష వేపు మొగ్గు చూపినా ఆయనకు ప్రౌఢగ్రాంథిక పదప్రయోగం మీద అవసరానికి మించిన మోజు ఉండేదన్న సంగతి "సునీథ" వంటి ఆయన రచనలు చదివిన వారికితెలుస్తుంది. ఆ తరవాత దశలో ఆయన ఆచార్య గోపదేవ్ ప్రభావంలో పడ్డారు. ఆర్యసమాజ విధానాలను ఆచరణలో పెట్టారు. ఆ తరువాత కవిరాజు త్రిపురనేని రామస్వామి హేతువాద వైఖరిని ఆరాధించారు. పురాణేతిహాసాలను పునర్వ్యాఖ్యానిస్తూ 'భిక్షాపాత్ర' వంటి రచనలు చేయడానికి ఈ ప్రభావం దోహద పడింది. ఆ తరవాత గోపీచంద్ ప్రభావంలో పడి ప్రాచ్యపాశ్చాత్య తత్త్వశాస్త్ర అధ్యయనం కొనసాగించారు. గోపీచంద్ ప్రభావంలో ఉన్న రోజుల్లోనే ఆయనపై కొడవటిగంటి కుటుంబరావు, క్రిస్టొఫర్ కాడ్వెల్ చెరగని ముద్ర వేశారు. ప్లేటో, అరిస్టాటిల్, కాంట్ హెగెల్, మార్క్సు వంటివారి తాత్త్వికవిచారం కృష్ణరావు సాహిత్యానికి నేపథ్యరచన చేసింది. రెండవ ప్రపంచయుద్ధ కాలంనాటి ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిణామాలన్నింటికీ ఏదో ఒక విధంగా బాధ్యతాయుతమైన ప్రతిస్పందనను ప్రకటించిన తెలుగు మేధావులలో కృష్ణరావు విలక్షణుడు. మార్క్సు వాద వ్యతిరేక వైఖరికి కారణమైన మానవేంద్రనాథ్‌రాయ్ వ్యాప్తి చేసిన నవ్య మానవ వాద (Radical Humanism) ప్రచారకులలో కృష్ణరావు ప్రముఖవ్యక్తి. ఆ నవ్యమానవ వాద ప్రభావం ఆయన సృజనాత్మక సాహిత్యం మీద మాత్రమే కాక విమర్శ వైఖరి మీద కూడా బలమైన ముద్ర వేసింది. తెలుగునాట రాయిస్టులలో కృష్ణరావు ప్రముఖుడు. భారతీయ తత్త్వశాస్త్రాన్ని అధ్యయనం చేసినా దానిపట్ల విశ్వాసాన్ని పెంచుకోక ఆయన బౌద్ధం వేపు మొగ్గుచూపారు. మాధ్యమిక వాద ప్రవర్తకుడైన ఆచార్య నాగార్జునుడు ఆయనకు ఆరాధ్యుడయాడు. అందుకు గుర్తుగా పోయిన రచనలు పోగా "విగ్రహవ్యావర్తిని' అనువాదం, దానికి కూర్చిన బృహత్ పీఠిక మిగిలాయి. ఇంత జరిగినా ఆయన భారతీయ తత్త్వశాస్త్ర ప్రభావం నుండి, అలంకార శాస్త్ర ప్రభావం నుండి తప్పించుకోలేకపోయారని కె.వి.రమణారెడ్డి వంటివారు నిశితంగా విమర్శించారు[3]. కృష్ణరావుకు సహచరులైన తుమ్మల వెంకట్రామయ్య, గోపీచంద్, కొడవటిగంటి కుటుంబరావు, పరిచితుడైన సంజీవ్‌దేవ్ వంటివారు తమ సాహిత్య ప్రస్థానంలో అచిరకాలంలోనే ఒక స్థిర మార్గాన్ని ఎంచుకొని తుదివరకు ఆ విశ్వాసాన్నే అంటిపెట్టుకొని రచనలు చేసి ప్రఖ్యాతులయ్యారు. కృష్ణరావు ఆ విధంగా కాక చివరివరకు పరిణతి చెందుతూనే ఉన్నారు. ప్రతి దశలోను తన విశ్వాసాన్ని సజ్జలను సజ్జలుగా తిరిగి అందించే వైఖరిలో కాక జీర్ణించుకొన్న అనుభవసారంగా తన సాహిత్యంలోను, విమర్శలోను అందించడం ఆయన ప్రత్యేకత. అంతేకాదు, కొన్ని సందర్భాలలో ధ్వని - స్వప్నం వంటి విరుద్ధ ప్రకృతుల మధ్య సమన్వయాన్ని సాధించడానికి ఆయన చేసిన సాహసం వింతగా కనిపిస్తుంది. విరుద్ధ ప్రకృతుల కూడలిగా కృష్ణరావు కనిపిస్తారు. తన ఫర్నిచరు షాపులో మిత్రులందరితోను తాత్త్విక చర్చలు నడుపుతూ కూర్చొని, దివాలాతీసి ఎప్పటి కప్పుడు సంసారభారాన్ని ఈడవడానికి గౌరవప్రదమైన మార్గాలను జీవితాంతం వెతుక్కున్నట్లుగా తన విమర్శప్రస్థానంలో కూడా తన అభిరుచి మార్గం కోసం నిరంతరాన్వేషిగా ఆయన మథనపడ్డారు. విలువలను పెంచడానిక నిరంతర కృషిచేసారు.

కృష్ణరావు గుంటూరులోని ఆంధ్రక్రైస్తవ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన కాలం (1934-37) ఆయన సాహిత్య విమర్శప్రస్థానంలో తొలి వికాసదశ. కాశీహిందూ విశ్వవిద్యాలయంలో ఆంగ్లసాహిత్యంలో

ఎం.ఏ పట్టం కోసం చదివిన కాలం (1940-41). మలి వికాస దశ. మద్రాసు విశ్వవిద్యాలయంలో పరిశోధక పట్టభద్రత కోసం పనిచేసిన కాలం (1952-53) మూడవ వికాసదశ. తెనాలి వి.ఎస్. ఆర్. కళాశాలలో అధ్యాపక వృత్తిలో కొనసాగినకాలం (1954-62), విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో పనిచేసిన కాలం (1963-73), ఆతరువాత కాలం (1979) పరిపుష్ట దశలు. సాహిత్య విమర్శకుడుగా రెండుగ్రంథాలు కృష్ణరావు ప్రతిష్టను ఇనుమడింపజేసాయి. అవి (1) కావ్యజగత్తు (2) కళాపూర్ణోదయ అధ్యయనము (Studies in Kala Purnodaya). కావ్యజగత్తును కాశీ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఉన్న దశలోను, కళాపూర్ణోదయ విమర్శను మద్రాసులో పి.హెచ్.డి పట్టాకోసం చదువుతున్నప్పుడు రాసారు. ఇవికాక 'నవతోరణం' అన్నపేరుతో ఆయన పేర తొమ్మిది సాహిత్య విమర్శవ్యాసాల సంకలనం ఒకటి వెలువడింది. అనేక సందర్భాలలో సాహిత్యభవితవ్యం, నా సాహితీ యాత్ర, ధ్వని-ప్రతిధ్వని, నాదశక్తి, శబ్ద వివేకం వ్యాకరణం వంటి విమర్శ వ్యాసాల నెన్నింటినో వెలువరించారు. సన్నగా, పొడవుగా తెల్లని బట్టలతో ఒక ప్రక్కకు ఒరిగి నడుస్తున్నట్లుగా కృష్ణరావు కనిపించేవాడని సంజీవదేవ్ అన్నారు. ఈ ఒరుగు ఆయన నడకలోనే కాక ఆయన సారస్వత విమర్శలో కూడా కనిపిస్తుంది. ఆయనలో ఒదుగు కంటే ఒరుగు ఎక్కువ.

ప్రత్యేకంగా గ్రంథరూపంలోను వ్యాసరూపంలోను సాహిత్య విమర్శ చేయడమే కాక తన కావ్యాలలోను, నాటకాలలోను, నవలలలోను, కథలలోను కూడా సందర్భవశంగా కృష్ణరావు సాహిత్య విమర్శను చేయడం కనిపిస్తుంది. ఆయన కావ్యలక్షణాన్ని గూర్చి, కవితా సామగ్రిని గూర్చి స్వయంగా చెప్పుకొన్న బహుముఖప్రజ్ఞావంతుడు. 1937లో ఆయన రాసిన 'యుగసంధ్య' అనే కావ్యంలోని "ప్రసక్త ప్రస్థానం" అనే ఖాండంలో కొంత కావ్య విమర్శ కనిపిస్తుంది.


సంఘమ్ము తోడిదే సాహిత్య లక్ష్మి
జనుల జీవితములే సామగ్రి కవికి
ప్రజలాదరింపగా బరగు కావ్యమ్ము
ఇట్లున్న ధర్మమ్ము నీసడించకుము

... ... ...

హృదయ కేదార ఖాండమ్ము నెల్ల ఆత్మ
వాక్య నిర్గళిత సుధా ప్రవాహమందు
ముంచి యెత్తెదు కాంక్షలుప్పొంగి కాదె
చేయుచున్నారు సుకవు లమేయ తపము.

పై పద్యాలలోని భావాలను బట్టి ఆ కావ్యానికి "యుగసంధ్య" అనే పేరు పెట్టడంలో గల ఔచిత్యమేమిటో తెలుస్తుంది. ఆ కావ్యరచనా కాలం నాటికి కృష్ణరావు సాహిత్య విమర్శ దృక్పథమేమిటో తెలుస్తుంది. తన కాల్పనిక సాహిత్యంతో ఆయన సాహిత్య విమర్శ చేస్తూ ఉండే వాడనడానికి ఈ అంశం స్థాలీపులాక న్యాయమైన ఉదాహరణగా నిలుస్తుంది.

*(ఇంకా వుంది)*



జులియస్ సమాధి (1505-1545)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2006-08



అంతిమ తీర్పు